RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 14 శనివారం 8 ఫిబ్రవరి 2025 పేజీలు : 4

### చరిత్రను తుడిచేసే యత్నం : రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ : చరిత్రను తుడిచిపెట్టేందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) నిరంతరం ప్రయత్నిస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. నియామక, పదోన్నతులకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన ముసాయిదా నిబంధనలకు వ్యతిరేకంగా డీఎంకే విద్యార్థి విభాగం జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన నిరసనలో వారిద్దరూ పాల్గొన్నారు. 'ఈ దేశంలోని అన్ని చరిత్రలు, సంస్కృతులు, సంప్రదాయాలను నిర్మూలించడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని కొద్దికాలంగా నేను చెబుతూ వస్తున్నాను. రాజ్యాంగంపై వారు దాడిచేస్తున్నారు. దేశం మీద ఒకటే చరిత్ర, ఒకటే సంప్రదాయం, ఒకే భాష, ఆలోచనను రుద్దాలని అనుకుంటున్నారు' అని అన్నారు.

# క్యాబినెట్ విస్తరణ జరిగేనా?

## మంత్రి పదవి దక్కే ఆ ఆరుగురు అదృష్టవంతులు ఎవరు?




తెలంగాణ పాలిటిక్స్‌లో అదో డైలీ ఎపిసోడ్. రేపో మాపో అన్నట్లుగా ఏడాదిగా సీరియల్‌లా వాయిదా పడుతూ వస్తోన్న క్యాబినెట్ విస్తరణపై మరోసారి ఇంట్రెస్టింగ్ టాక్ వినిపిస్తోంది. ఎన్నాళ్లో వేచిన ఉదయం రాబోతుందని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్‌తో ఈసారి మంత్రివర్గ విస్తరణ పక్కా అన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ సారైనా క్యాబినెట్ ఎక్స్‌ప్యాన్షన్ జరిగేనా? అమాత్య యోగం దక్కే ఆ ఆరుగురు అదృష్టవంతులు ఎవరు? ఆరు బెర్తులు, ఎందరో ఆశావహులు. ఇది తెలంగాణ క్యాబినెట్ విస్తరణపై ఏడాదిగా కొనసాగుతున్న సస్పెన్స్. ఇప్పటికీ మంత్రివర్గ విస్తరణపై ఎటూ కొలిక్కి రాకపోవడంతో ఒక్కోసారి ఆశావహులు ఆశలు..చల్లబడి..మరోసారి చిగురిస్తున్నాయట. అయితే ఇప్పుడు మరోసారి తెలంగాణ క్యాబినెట్ విస్తరణ వార్త ఇంట్రెస్టింగ్‌గా మారింది. లేటెస్ట్ డెవలప్‌మెంట్స్, సీఎం, పీసీసీ చీఫ్‌కు ఢిల్లీ నుంచి పిలుపురావడం బట్టి చూస్తుంటే..క్యాబినెట్ విస్తరణ పక్కా అన్న అంచనాకు వస్తున్నారు ఆశావహులు. సరిగ్గా ఇదే టైమ్‌లో సీఎం రేవంత్ రెడ్డి హఠాత్తుగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో మళ్లీ ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సీఎంతో పాటు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను అధిష్టానం పెద్దలు పిలవడం, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో ఈసారి కచ్చితంగా మంత్రివర్గ విస్తరణ ఉంటుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

**ఎవరెవరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలన్నదానిపై చర్చలు..** అయితే ఎవరెవరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలన్నదానిపైనే కాంగ్రెస్ అధిష్టానం సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో డిస్కస్ చేసినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో క్యాబినెట్‌లో చోటు దక్కించుకునేందుకు పలువురు ఎమ్మెల్యేలు తమ స్థాయిలో లాబీయింగ్ చేస్తుండగా, ఏ క్షణంలోనైనా మంత్రివర్గ విస్తరణపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం కొలువైన సందర్భంగా ఏర్పాటైన మంత్రివర్గమే ఇప్పటికీ కొనసాగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి సహా మంత్రివర్గంలో మొత్తం 12 మంది ఉండగా మరో ఆరుగురికి అవకాశం ఉంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత మంత్రివర్గం విస్తరణ అన్నారు. ఆ తర్వాత దసరా, దీపావళి, సంక్రాంతి అన్ని ముహూర్తాలు గడిచిపోయాయి. ఏడాది పాలన కూడా పూర్తైంది.

**ఈసారి తమకు మంత్రి పదవి దక్కడం ఖాయమని ప్రచారాలు..** కానీ ఇప్పటికీ పూర్తిస్థాయి మంత్రివర్గం ఏర్పాటు కాలేదు. దీంతో అమాత్య పదవులపై ఆశలు పెట్టుకున్న ఆశావహులు తెగ బాధపడిపోతున్నారు. మంత్రి వర్గ విస్తరణపై చాలా మంది ఎమ్మెల్యేలు ఆశగా ఎదురుచూస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎప్పుడు ఢిల్లీ వెళ్లినా.. ఈసారి తమకు మంత్రి పదవి దక్కడం ఖాయమని తమ అనుచరులతో తెగ చెప్పుకుంటున్నారు. అంతేకాదు కొంతమంది అయితే ఏకంగా తమ అనుకూల మీడియాలో పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్నారన్న చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లడం, ఎమ్మెల్యేలు ఎదురుచూసి చూసి చతికిల పడటం సర్వసాధారణం అయిపోయింది.

**మంత్రివర్గంలో ఎలాగైనా ఈసారి తమ పేరు ఉండాల్సిందేనని సీనియర్ల పట్టు..** మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతూ వస్తున్నా..ఎమ్మెల్యేల లాబీయింగ్ మాత్రం ఆగడం లేదన్న చర్చ జరుగుతోంది. తమ పరిచయాలు, అనుకూల వర్గాల ద్వారా ఢిల్లీ పెద్దలతో రాయబారం నడుపుతున్నారట. మంత్రి పదవిని దక్కించుకోవడానికి ఉన్న అన్ని అవకాశాలను వాడుకుంటున్నారు నేతలు. ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డితో టచ్‌లో ఉంటూనే మరోవైపు ఢిల్లీ పెద్దలను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. మంత్రివర్గంలో ఎలాగైనా ఈసారి తమ పేరు ఉండాల్సిందేనని కొందరు సీనియర్లు పట్టుదలతో ఉన్నారట. అసలు మంత్రివర్గ విస్తరణ ఆలస్యం కావడానికి కారణాలు ఏమై ఉంటాయన్నది కాంగ్రెస్ నేతలెవ్వరికి అంతుపట్టకపోవడంతో నిరాశ నిట్టూర్పుతో ఎదురు చూస్తున్నారు. ఎందుకు కాంగ్రెస్ అధిష్టానం మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదని ఆశావహులు తలలు పట్టుకుంటున్నారు.

మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇప్పటికే అధిష్టానం పెద్దలతో పలుమార్లు సంప్రదింపులు జరిపినా క్లారిటీ రావడం లేదంటున్నారు. ఈసారి సీఎం ఢిల్లీ టూర్ మంత్రివర్గ విస్తరణ కోసమేనని భావిస్తున్నారు. ఇప్పుడైనా మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా..లేక మళ్లీ వాయిదా పడుతుందా అనేది చూడాలి మరి.




## జనసేన పార్టీకి మరో గుడ్‌న్యూస్

### తెలంగాణలోనూ 'గ్లాసు' గుర్తు కేటాయింపు!

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో (2024) 100 శాతం సీట్లలో విజయం సాధించి, 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన పార్టీగా రికార్డు సృష్టించిన జనసేన పార్టీకి మరో తీపికబురు అందింది. ఇప్పటికే రిజిస్టర్డ్ పార్టీగా గుర్తింపును దక్కించుకొని ఏపీలో గాజు గ్లాసు గుర్తును పదిలం చేసుకున్నది. ఇప్పుడు తెలంగాణలో కూడా జనసేన పార్టీకి గుర్తింపు దక్కింది. స్థానిక ఎన్నికల్లో పోటీకి జనసేన పార్టీకి గాజు గ్లాసు గుర్తను ఎన్నికల సంఘం కేటాయించింది. దీంతో తెలంగాణ రాష్ట్రంలోని జనసేన పార్టీ నేతలు, శ్రేణుల్లో హర్షం వ్యకతమవుతున్నది. జనసేన పార్టీని ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీగా గుర్తింపు ఇచ్చామని, దానికి అనుగుణంగానే తెలంగాణలోనూ గుర్తించాలని, గాజు గ్లాస్ గుర్తును కేటాయించాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆపార్టీ లీగల్ సెల్ చైర్మన్కు లేఖ రాశారు. ఈ మేరకు జనసేన పార్టీని తెలంగాణ రాష్ట్రంలో గుర్తిస్తూ ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జనసేనకు గాజుగ్లాసు గుర్తును కేటాయించడంతో తెలంగాణలో కూడా వచ్చే ఎన్నికల నాటికి పార్టీని జాగృతం చేసే పనిలో ఉన్నట్టుగా తెలుస్తున్నది. ఇప్పటివరకూ తెలంగాణ రాజకీయాల్లో జనసేన పార్టీ కొంత అంటీముట్టనట్టుగానే ఉంటూ వస్తున్నది. ఆ పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఏపీ రాజకీయాలకే పూర్తిగా ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. ఇక రెండు రాష్ట్రాల్లో క్రియాశీలకం కానున్నారు. ఏపీలో మాదిరిగానే తెలంగాణలో కూడా వచ్చే ఎన్నికల్లో కూటమి కట్టే పనిలో భాగంగానే చకచకా శ్రేణులను సమాయత్తం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. దానిలో భాగంగానే అధికారిక చిహ్నం కోసం చేసిన ప్రయత్నాలు సఫలంకావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతున్నది.



## కొలిక్కి వచ్చిన నూతన టిపిసిసి కార్యవర్గ కసరత్తు..

టీపీసీసీ కార్యవర్గ కసరత్తు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది.. ఈమేరకు ఇవాళ లేదా రేపు ప్రకటన వస్తుందని సమాచారం. ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసి కులగణన, ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన నివేదికలను అందజేశారు. కుల గణన,వర్గీకరణ వల్ల ఆయా వర్గాలకు జరిగే ప్రయోజనాలను ఖర్గే కు వివరించారు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నందుకు రేవంత్ రెడ్డి,భట్టిలను అభినందించారు ఖర్గే.

ఈ క్రమంలో నల్గొండ, మెదక్ లో నిర్వహించనున్న రెండు భారీ బహిరంగ సభలకి హాజరు కావాలని ఖర్గేను ఆహ్వానించారు సీఎం రేవంత్,డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.

## ఫోన్ ట్యాపింగ్ కేసు...

### శ్రవణ్‌కుమార్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న న్యూస్ ఛానల్ ఎండీ శ్రవణ్‌కుమార్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం మరోసారి విచారణ జరిగింది. చాలా మంది ముఖ్యమైన వ్యక్తుల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో శ్రవణ్‌కుమార్ హస్తం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) కోర్టు దృష్టికి తెచ్చారు. ఫోన్ ట్యాపింగ్‌లో అతని పాత్రపై ఎఫ్ఎస్ఎల్ నివేదికలో అనేక విషయాలు ఉన్నాయన్నారు. శ్రవణ్‌కుమార్‌ను ప్రకటించబడ్డ నేరస్తుడిగా పరిగణించాలని, ముందస్తు బెయిల్ మంజూరు చేయొద్దని పీపీ కోరారు. ఫోన్ ట్యాపింగ్‌తో శ్రవణ్‌కుమార్‌కు సంబంధం లేదని అతని తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు పూర్తికాగా, తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది.




## మీ సేవ కేంద్రాల్లో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్: తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. లబ్ధిదారుల నుంచి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించాలని మీ సేవ కమిషనర్‌ను పౌరసరఫరాలశాఖ కోరింది. కొత్త రేషన్ కార్డుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా విపరీతంగా డిమాండ్ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త కార్డుల జారీ ప్రారంభించినప్పుడు.. ఎంపిక చేసిన గ్రామాల్లో సుమారు లక్ష కార్డులను పంపిణీ చేసింది. ఇప్పటికీ చాలా మంది కొత్త రేషన్‌కార్డులు కావాలని, ఉన్న కార్డుల్లో మార్పులు చేర్పులు చేయాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన వార్డు, గ్రామ సభలు, ప్రజా పాలనలో భాగంగా సుమారు 10 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికీ దరఖాస్తుల వెల్లువ కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మీ సేవ కేంద్రాల ద్వారా కూడా దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మీ సేవ కమిషనర్‌ను కోరింది. రేషన్ కార్డులకు సంబంధించిన డేటాబేస్‌ను మీ సేవతో అనుసంధానం చేయాలని ఎన్ఐసీని ప్రభుత్వం ఆదేశించింది. లబ్ధిదారులు ఇప్పటికే ఇచ్చిన దరఖాస్తులన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నాయని, దరఖాస్తు చేయని వారు మాత్రమే మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రేషన్ కార్డుల మంజూరుకు సంబంధించిన మార్గదర్శకాలను ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసింది.

# బిజెపి ఆట మొదలెట్టేసిందా...!?

## ఆప్ అభ్యర్థులకు ప్రలోభాలు!




న్యూఢిల్లీ: మరికొన్ని గంటల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు వెలువడనున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన ఢిల్లీ ఎన్నికల్లో ఏ పార్టీ గెలుపు జెండా ఎగరేస్తుందనే దానిపై నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. ఎన్నికలు ముగియగానే వెలువడిన మెజార్టీ ఎగ్జిట్ పోల్స్.. ఢిల్లీలో బీజేపీదే అధికారమని అంచనా వేశాయి. గత మూడు పర్యాయాలు అప్రతిహత విజయాలు సాధిస్తూ వచ్చిన అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి ఈ సారి భంగపాటు తప్పదని ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేశాయి. మరికొన్ని గంటల్లో ఫలితాలు వెలువడనున్న తరుణంలో ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఫలితాల విడుదలకు ముందే బీజేపీ తమ పార్టీ అభ్యర్థులను ప్రలోభాలకు గురి చేస్తోందని ఆరోపించారు.

ఆప్‌కు చెందిన 16 మంది ఎమ్మెల్యే అభ్యర్థులకు బీజేపీ ఫోన్ చేసింది. బీజేపీలోకి వస్తే ఒక్కొక్కరికి రూ.15 కోట్లతో పాటు మంత్రి పదవులు ఇస్తామని ఆఫర్ ఇచ్చిందని కేజ్రీవాల్ ఆరోపణలు చేశారు. మెజార్టీ ఎగ్జిట్స్ పోల్స్ బీజేపీ విజయం సాధిస్తుందని తేల్చేశాయి. అలాంటప్పుడు బీజేపీ తమ పార్టీ అభ్యర్థులను ఎందుకు ప్రలోభాలకు గురి చేస్తోంది..? అంటే.. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పని.. అవి ఫేక్ సర్వేలని బీజేపీ ఒప్పుకుందని పేర్కొన్నారు. కానీ ఆప్ అభ్యర్థులు ఒక్కరు కూడా బీజేపీ ఆఫర్లకు లొంగరని స్పష్టం చేశారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలను ఉటంకిస్తూ.. సుల్తాన్‌పూర్ మజ్రా ఆప్ అభ్యర్థి ముఖేష్ అహ్లావత్ సైతం ఇదే తరహా కామెంట్స్ చేశారు. "నాకు బీజేపీ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతోంది. ఆప్?ను వీడి మా పార్టీలోకి వస్తే.. మంత్రి పదవితో పాటు రూ.15 కోట్లు ఇస్తాం" అని ఆఫర్ ఇచ్చారని ఆయన తెలిపారు. కానీ కేజ్రీవాల్ పార్టీలో నాకు ఇచ్చిన సుముచిత గౌరవ కారణంగా నేను చనిపోయే వరకు ఆప్?ను వీడనని వాళ్లకు చెప్పానని అన్నారు. మరోవైపు.. కేజ్రీవాల్ వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్ అయ్యింది.

ఫలితాల విడుదలకు ముందే ఓటమి భయంతో కేజ్రీవాల్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని.. బీజేపీ ఆప్ అభ్యర్థులను ఎవరిని ప్రలోభాలకు గురి చేయలేదని ఆప్ అధినేత ఆరోపణలను ఖండించింది. కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే పరువు నష్టం దావా వేస్తామని బీజేపీ హెచ్చరించింది.

# సంపాదకీయం

## ఆప్ ఓడితే ఆడిపోసుకునేది కాంగ్రెస్ నే!

కాంగ్రెస్ ఇపుడు ఇండియా కూటమిలోని ఇతర పార్టీలకు టార్గెట్ గా మారుతోంది. ఇండియా కూటమిలో పెద్దన్న పాత్ర పోషించేందుకు తహతహలాడుతున్న పార్టీలు చాలా కాలంగా కాంగ్రెస్ రాజకీయ విధానాలను గట్టిగా విమర్శిస్తూ వస్తున్నాయి. అది కాస్తా హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమితో మెల్లగా మొదలై మహారాష్ట్రలో ఓటమితో తారస్థాయికి చేరుకుంది. ఇపుడు ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఓడిపోతే కనుక కాంగ్రెస్ మీద అంతా కలసి ఆడిపోసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ మీద అపుడే సమాజ్ వాది పార్టీకి చెందిన నేతలు విమర్శలు చేస్తున్నారు. ఎస్పీ నాయకులు ఎంతదాకా విమర్శల దాడిని పెంచారంటే కాంగ్రెస్ ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీం గా పనిచేసిందని హాట్ కామెంట్స్ చేశారు. బీజేపీకి లాభం చేకూర్చడానికే కాంగ్రెస్ పోటీ అని తేల్చేశారు. ఆప్ కి మద్దతు ఇవ్వకుండా ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేసింది. దాంతో చాలా చోట్ల ఓట్లు చీలి బీజేపీ లాభపడింది అని అంటున్నారు. ఎగ్జిట్ పోల్స్ సర్వేలు ఆప్ ఓటమి పాలు అవుతుందని చెబుతున్నాయి. దాంతో ఇండియా కూటమి మిత్రులు కాంగ్రెస్ మీద విమర్శలు మొదలెట్టారు. నిజంగా ఎగ్జిట్ పోల్స్ సర్వే ఫలితాలు ఎగ్జాక్ట్ పోల్స్ లోనూ వస్తే మాత్రం ఇండియా కూటమిలో మిత్రులు అంతా కాంగ్రెస్ మీద పెద్ద ఎత్తున విరుచుకుపడడం ఖాయమని అంటున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ కే ఇండియా కూటమిలోని చాలా పార్టీలు మద్దతుగా నిలిచాయి. అదే సమయంలో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసింది. కాంగ్రెస్ కి సీట్లు పెద్దగా రావు అని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. అయితే ఓట్ల చీలికతో బీజేపీకి కాంగ్రెస్ పోటీ మేలు చేసేలా ఉందని విశ్లేషణలు ఉన్నాయి. ఇవన్నీ పక్కన పెడితే ఇప్పటికే ఇండియా కూటమిలో లుకలుకలు బయటకు వస్తున్నాయి. కాంగ్రెస్ పెద్దన్నగా ఉంటే బీజేపీని ఎదుర్కోవడం కష్టమని మిత్రులు అంటున్నారు మమతా బెనర్జీకి సారధ్యం చేపట్టాలని ఉంది. దాంతో ఆమెకు బాధ్యతలు అప్పగించమని అంతా కోరుతున్నారు. ఢిల్లీ ఎన్నికల తరువాత ఇండియా కూటమిలో కీలక మార్పులు జరిగే అవకాశాలను కూడా ఎవరూ కొట్టిపారేయడం లేదు. అదే సమయంలో కాంగ్రెస్ నుంచి సారథ్య బాధ్యతలు తీసుకునే అవకాశాలు కూడా ఎక్కువ అవుతాయి అంటున్నారు.

అపుడు కాంగ్రెస్ చూ స్తూ ఊరుకుంటుందా లేక తమ పట్టుని నిలబెట్టుకుంటుందా అన్నది కూడా ఆసక్తిక రమే. కాంగ్రెస్ నే సారధ్యం వహించాలని కోరే పార్టీలూ ఇండియా కూటమిలో ఉన్నాయి. దాంతో కాంగ్రెస్‌తో ఈ విషయం లో విభేదించే పార్టీలు వేరు పడతాయా ఇండియా కూటమిలో చిచ్చుకు ఆ మీదట చీలికకు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దారి తీస్తాయా అన్నది ఇపుడు హాట్ టాపిక్ గా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.



## తుంకుంట మున్సిపల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్

శామీర్ పేట, (గరుడ వార్త) : తుంకుంట మున్సిపల్ ను పనితీరును మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ తనిఖీ చేశారు. శుక్రవారం శామీర్ పేట మండలం తుంకుంట మున్సిపల్ కార్యాలయాన్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలాఖరు లోగా పన్నులను 100% వసూళ్లు చేయాలని సూచించారు.పన్నుల వసూళ్ల విషయంలో బిల్ కలెక్టర్ లకు, వార్డ్ అధికారులకు తగు సూచనలు చేశారు. ముందుగా రోజు వారిగా జరుగుతున్న బయో మైనింగ్ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారుల ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, డిప్యూటీ ఇంజినీర్ సునీత, మేనేజర్ శ్రావణ్ కుమార్, పర్యావరణ ఇంజనీర్ కన్నేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



## పరీక్షా సమయం.. ప్రణాళిక అవసరం



కరీంనగర్ : పరీక్షల సమయం సమీపిస్తోంది.. ఇప్పటికే ఉత్తమ మార్కుల కోసం ఉమ్మడి జిల్లాలోని పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు సిద్ధమవుతున్నారు.. పునశ్చరణ, సన్నద్ధత పరీక్షలు కొనసాగుతున్నాయి. మార్చిలోనే ఎస్సెస్సీ, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఉండటంతో విద్యార్థుల్లో కొంత ఆందోళన, ఇంకొంత భయం నెలకొంది. సమయం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుతూ.. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటేనే ఆశించిన ఫలితాలు సాధించవచ్చు.

**అధ్యాపకుల సూచనలు..**

ఎప్పటి పాఠాలు అప్పుడే చదివే విద్యార్థుల్లో పరీక్షలపై అంతగా అందోళన ఉండదు. విద్యా సంవత్సరం పొడవునా సరదాగా గడిపి పరీక్షల సమయంలో ఇన్ని సబ్జెక్టులు చదవగలమా అనే అందోళన పడే విద్యార్థులుంటారు. అందుకే ఎవరికైనా సమయపాలన, ప్రణాళిక అవసరం.

ఇప్పటి నుంచే పాఠ్యాంశాల సిలబస్‌లోని ముఖ్య అంశాలు, ప్రశ్నల సరళి, ప్రశ్నపత్రాల బ్లూప్రింట్‌పై అవగాహన, మార్కుల కేటాయింపుపై అవగాహన పెంచుకోవాలి.

పరీక్షలకు ముందే అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా చదవడానికి రోజువారీగా సమయపాలన ప్రణాళిక నిర్ధారించుకోవాలి.

గత ప్రశ్నపత్రాలను సాధన చేయడానికి ప్రత్యేక ప్రణాళిక వేసుకోవాలి.

రోజులో ఎన్ని సబ్జెక్టులు చదవాలి, వారంలో ఎన్నింటిని పూర్తి చేయాలనే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి.

సులభంగా ఉన్న వాటిని, కష్టంగా ఉన్న పాఠ్యాంశాలను ఎన్ని రోజులు, ఎంత సమయం, ఎన్ని గంటలు చదవాలనే దానిపై నిర్దిష్ట ప్రణాళిక అవసరం.

దైనందిన అవసరాల సమయాన్ని కుదించి ఏకాగ్రతతో ఏ సమయంలో చదవగలవో అనే దాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా సమయసారిణిని నిర్ధారించుకుని ప్రణాళికతో చదవాలి.

పరీక్షలకు ముందు భయందోళనను వీడేందుకు ప్రాక్టీస్ పేపర్లను సాధన చేయాలి.

నిత్యం పాఠ్యాంశాలను చదివేందుకు, పునశ్చరణకు సమయాలను వేర్వేరుగా నిర్ధారించుకోవాలి. సందేహాలను అధ్యాపకులు, ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలి.

ఏకధాటిగా చదవకుండా ప్రతి గంటకు 5-10 నిమిషాలు విరామం తీసుకోవాలి.

వీటికి విరామమిద్దాం..

చరవాణుల వినియోగాన్ని తగ్గించాలి. భావోద్వేగాలను కలిగించే సామాజిక మాధ్యమాలకు పూర్తిగా దూరమవ్వాలి.

టీవీ, సినిమాలు పరీక్షల వరకు పక్కన పెట్టేయాలి.

విందులు, వేడుకలకు దూరంగా ఉండటం మంచిది.

ఇవీ ముఖ్యమే..

పరీక్షలకు సన్నద్ధ సమయంలో విద్యార్థులకు సమతుల ఆహారం అవసరం. ప్రొటీన్స్, విటమిన్లు, మినరల్స్ ఉండే ఆహారం తీసుకోవాలి.

తగినంత నీరు తాగుతుండాలి. ఆహారంలో పండ్లు భాగం చేసుకోవాలి.

పరీక్షలు పూర్తయ్యే వరకు మాంసాహారం, కొవ్వు పదార్థాలు, మసాలాలు, జంక్ ఫుడ్, బయటి ఫుడ్‌కు దూరంగా ఉండటం మేలు.

నిత్యం కనీసం 6 నుంచి 8 గంటల నిద్ర అవసరం.

రోజూ కొంతసేపు చిన్న చిన్న వ్యాయామాలు చేస్తే ఒత్తిడి దూరమవుతుంది.

నిత్యం ఉదయం, సాయంత్రం కాసేపు ధ్యానం, ప్రాణాయామం సాధన చేస్తే ఆక్సిజన్ సరఫరా మెరుగవుతుంది.

కొంత సేపు నడక ద్వారా రక్తప్రసరణ పెరిగి మెదడు చురుకుగా వ్యవహరిస్తుంది.

ఒకే చోట కూర్చుని గంటల తరబడి చదవకుండా మధ్య మధ్యలో ఆరుబయట కాసేపు తిరగాలి.

చదువుకున్న అంశాలు స్నేహితులతో చర్చించాలి. అప్పుడు ఆ అంశాలు బాగా గుర్తుండిపోతాయి.

కరీంనగర్
పదో తరగతి విద్యార్థులు 12,641
ఇంటర్ విద్యార్థులు 33,974

జగిత్యాల
పదో తరగతి విద్యార్థులు 11,887
ఇంటర్ విద్యార్థులు 14,252

రాజన్న సిరిసిల్ల
పదో తరగతి విద్యార్థులు 6,767
ఇంటర్ విద్యార్థులు 8,110

పెద్దపల్లి
పదో తరగతి విద్యార్థులు 7,392
ఇంటర్ విద్యార్థులు 10,566

ఆహారం విషయంలో జాగ్రత్త

పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు సమయం ప్రకారం ఆహారం తీసుకోవాలి. మాంసాహారం, మసాలాలకు దూరంగా ఉండాలి. రోజూ ఉడికించిన కోడి గుడ్డు తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ప్రొటీన్లు అందుతాయి. స్నాక్స్‌గా డ్రైఫ్రూట్స్ తీసుకోవడం మేలు. భోజనంలో ఆకుకూరలు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి. - బుర్ర స్ఫూర్తి, డైటీషియన్, కరీంనగర్

## ఉన్నవి పెంచలే.. కొత్తవి మంజూరు కాలే



కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్లు ఎప్పుడిస్తుందోనని జిల్లాలోని అర్హులైనవారు ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఆసరా పథకంలో భాగంగా వృద్ధులు, వికలాంగులు, గీత, చేనేత కార్మికులు, వితంతువులకు రూ.2016 మంజూరు చేసింది. దివ్యాంగులకు మాత్రం రూ.3016 నుంచి గత ఎన్నికల సమయంలో రూ.వెయ్యి పెంచి రూ.4016 అందించింది. తాము అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వచ్చి ఏడాది గడిచినా కొత్తవి మంజూరు కాకపోవడంతో సుమారు 2500 మందికి పండుగ పూట నిరాశే ఎదురైంది.

**కేబినెట్ సమావేశంలో చర్చే లేదు** ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశాల్లో పింఛన్ పెంపునకు సంబంధించి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో అర్హుల్లో నిరుత్సాహం వ్యక్తమైంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఎంపీడీవోలు పలు దరఖాస్తులు ఆమోదించి గ్రామీణాభివృద్ధిశాఖకి పంపినవి దాదాపు వెయ్యివరకు ఉన్నాయి. ఇవి కాకుండా రెండున్నర సంవత్సరాలుగా కొత్త పింఛన్ దరఖాస్తులు తీసుకోలేదు. మొత్తం 2500మంది వరకు అర్హులు ఎదురుచూస్తున్నారు. వీరితోపాటు పింఛన్ల పెంపు కోసం 1,37,721మంది లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. దివ్యాంగులకు రూ.4016 ఇస్తుండగా మిగతా అందరికి రూ.2016 వస్తున్నాయి.

## ప్రకృతి వనాలా.. అడవులా..?

కారేపల్లి : గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 'పల్లె ప్రకృతి వనాల'ను ఏర్పాటు చేసింది. తొలుత స్థలాల కొరత ఏర్పడినా.. అందుబాటులో ఉన్న స్థలాల్లోనే మొక్కలను నాటించారు. గత ప్రభుత్వ హయాం వరకు వాటి నిర్వహణను స్థానిక పాలకవర్గాలు, అధికారం యంత్రాంగం ఎలాగోలా నెట్టుకొచ్చింది. గత రెండేళ్లుగా ఆయా వనాల వైపు కన్నెత్తి చూసిన నాథుడు లేడు. కొన్నిచోట్ల వనాలు ఎండి.. ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి నెలకొంది. మరికొన్ని ప్రదేశాల్లో రక్షణ కంచెల్లేక పశువుల సంచరిస్తున్నాయి.

**రూ.కోట్ల ప్రజాధనం వృథా**

ప్రకృతి వనాలకు లభ్యతను బట్టి అరెకరం నుంచి పదెకరాల వరకు స్థలాలు కేటాయించారు. చిన్నవాటిల్లో 2-4 వేలు, పెద్ద వనాల్లో



సుమారు 20 వేల మొక్కలు నాటించారు. ఇందుకోసం రూ.2-6 లక్షల వరకు నిధులను ప్రభుత్వం వెచ్చించింది. వాటి నిర్వహణకు సంబంధించి కూలీల ఖర్చులను ఉపాధి హామీ పథకం ద్వారా మళ్లించారు. ఇంతవరకు బాగానే ఉన్నా, గత రెండేళ్లుగా వనాల నిర్వహణ తీసికట్టుగా మారింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా దాదాపు ఇదే పరిస్థితి.

కారేపల్లి మండలంలోని తులిస్యాతండాలో ఏర్పాటు చేసిన వనాల్లో పట్టుమని పది మొక్కలు కనిపించడం లేదు. ఇక్కడి నర్సరీకి సూచిక బోర్డు మాత్రమే మిగిలింది.

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నారాయణపురం వనంలో గడ్డిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఒకప్పటి వనం ఇప్పుడు చిట్టడవిని తలపిస్తోంది.

భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లి మండలం మైలారంలోని ప్రకృతి వనం నర్సరీలో మొక్కలన్నీ ఎండిపోయాయి. పినపాక మండలం సీతారాంపురంలో అటవీ ప్రాంతంలోనే వనాన్ని ఏర్పాటు చేశారు. నిర్వహణ లేకపోవడంతో అక్కడి మొక్కలు చనిపోయాయి. ఉమ్మడి జిలాలో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యత ఆయా పంచాయతీలతో పాటు మండల స్థాయి అధికారులపై ఉంది. నిబంధనల ప్రకారం ఎంపీడీవో, ఏపీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు వనాల సంరక్షణను పట్టించుకోవాలి. నిర్వహణ సక్రమంగా లేనిచోట పరిశీలించి.. క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడతాం. వనాల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి, ఖమ్మం

## రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం భళా..!

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిల్లో ఖమ్మం కార్యాలయం నుంచే ప్రభుత్వానికి గణనీయ ఆదాయం లభిస్తుంది. గతేడాది రాబడి మరింత పెరగడం విశేషం. వివరాల్లోకి వెళ్తే.. 2024లో ఖమ్మం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 13,526 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా.. వీటి ద్వారా రూ.99.51 కోట్ల ఆదాయం లభించింది. అంతకుముందు 2023లో 14,078 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినా.. రూ.96.82 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. ఖమ్మం జిల్లాలో 7, భద్రాద్రి కొత్తగూడెం



జిల్లాలో 4 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ప్రభుత్వానికి లభించే ఆదాయంలో మొత్తం 11 కార్యాలయాల్లో ఒక్క ఖమ్మం నుంచే 50 శాతం వరకు వస్తుంది. మిగతా పది కార్యాలయాలూ కలిసి ఖమ్మం ఆదాయంతో పోటీ పడుతుంటాయి.

**ఎన్నికలతో మందగించినా..**

2024లో పార్లమెంటు ఎన్నికలు నిర్వహించగా ఎన్నికల కోడ్, ఇతర కారణాలతో సుమారు ఆర్నెల్లు స్థిరాస్తి వ్యాపారం మందగించింది. ఎన్నికలు ముగిసిన తర్వాత స్థిరాస్తుల క్రయ, విక్రయ లావాదేవీలు కొంత పెరిగాయి. దీంతో ఖమ్మంలో రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం పెరిగింది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో మూడు నెలలు ఉందని, క్రయ, విక్రయ లావాదేవీలు పెరిగే అవకాశం ఉందని, ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

## 44 గ్రామాలు.. 42,000 ఎకరాలు

కొత్తగూడెం : 'రైతు భరోసా' పథకం కింద పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేస్తోంది. సాగయ్యే పొలాలకే పథకం వర్తింపజేసే యోచనలో ఉంది. అర్హుల నిర్ధారణకు శాటిలైట్ సర్వేను ప్రామాణికంగా తీసుకోవాలని తొలుత భావించింది. ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వెల్లడికావడంతో మండలానికో గ్రామం చొప్పున పంటల నమోదు(క్రాప్ బుకింగ్)కు శ్రీకారం చుట్టింది. యాప్‌లో నమోదు చేసే ఆయా వివరాలను, 'శాటిలైట్ సర్వే'తో సరిపోల్చాలన్నది యోచన. దీని ప్రకారం 8వ తేదీలోగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మొత్తం 44 గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో విస్తరణాధికారు(ఏఈవో)లు పంటల నమోదు ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంది.

సర్వే ఇలా.. ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే నంబరు, దాని పరిధిలోని మొత్తం విస్తీర్ణం, ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఏఏ పంటలు సాగుచేశారు? అనే వివరాలను ఏఈవోలు నమోదు చేస్తారు.

సర్వేకు సంబంధించిన యాప్ అందుబాటులోకి వచ్చిన అనంతరం, క్షేత్రస్థాయిలో పంటల వివరాలు విధి విధానాల ప్రకారం నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉమ్మడి జిల్లాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

సోమవారం నుంచి మూడ్రోజుల పాటు పైలెట్ గ్రామాల్లో సర్వే జరిగే అవకాశముంది.

'మండలానికో గ్రామం చొప్పున సాగు భూముల పూర్తి వివరాలను నమోదు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశించింది. దీనికనుగుణంగా పైలెట్ గ్రామాలను ఎంపిక చేశాం. మూడ్రోజుల్లోగా ప్రక్రియ పూర్తికి చర్యలు తీసుకుంటాం'. బాబురావు, జిల్లా వ్యవసాయాధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# యూరియా ఏమాయె..?

సూర్యాపేట : జిల్లాలో 2024-25 యాసంగిలో 4.46 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేపట్టారు. అందులో ప్రధానంగా వరి 3.52 లక్షల ఎకరాల్లో చేపట్టారు. ధాన్యం దిగుబడికి యూరియా పలుమార్లు చల్లాల్సి ఉంది. ఇలా ఎకరాకు మూడుసార్లు మొత్తంగా నాలుగు బస్తాల వరకు వేస్తారు.

**వరికే ఎక్కువ వినియోగం**

రైతులకు నాణ్యమైన యూరియాను సరఫరా చేయాల్సిన ప్రభుత్వం నాసిరకంగా పంపిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దొడ్డు రకం అడిగితే సన్న యూరియా, సన్నది అడిగితే దొడ్డు ఎరువు ముడి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు..**

జిల్లాలో యాసంగిలో చేపట్టిన సాగుకు 34,023 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం పడుతుందని అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు 25,653 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. అందులో సగం సొసైటీలకు, మిగతా సగం ప్రైవేటు వ్యాపారులకు కేటాయిస్తున్నారు. సంఘాలకు కేటాయించిన యూరియా నాసిరకంగా ఉండటమే కాకుండా రాళ్లలా ఉంటోంది. దీంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తే కొన్నిచోట్ల అధిక ధరకు, మరికొన్ని దుకాణాల్లో ఇతర మందులకు ముడిపెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ



అధికారులు స్పందించి నాణ్యమైన యూరియా అందించి న్యాయం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రం రైతు విసవరం శరత్‌రెడ్డి యాసంగిలో పదెకరాల్లో వరి సాగు చేశారు. పొలంలో చల్లేందుకు నెమ్మికల్ సహకార సంఘంలో 18 బస్తాల యూరియా తీసుకున్నారు. బస్తాలు విప్పి చూడగా అంతా పెద్ద పెద్ద బండరాళ్ల వలె ఉంది. దీన్నంతా పొడిగా మార్చేందుకు రోజంతా కష్టపడాల్సి పరిస్థితి నెలకొంది. దీంతో చేతులు మొత్తం బొగ్గలు ఎక్కాయని, పని కూడా ఎక్కువ సమయం పట్టిందని వాపోయారు. హుజూర్‌నగర్‌లోని సహకార సంఘంలో యూరియా సరిగా సరఫరా చేయడం లేదని అన్నదాతలు ధర్నా చేశారు.

తనిఖీలు చేపడుతున్నాం:శ్రీధర్‌రెడ్డి, డీఏవో, సూర్యాపేట

నాణ్యమైన యూరియా అందించేలా చర్యలు తీసుకుంటున్నా. కొన్ని చోట్ల యూరియా బాగా లేదని ఫిర్యాదులు అందుతున్నాయి. పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం. ప్రైవేటు వ్యాపారులు యూరియా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

# చిప్పల మార్పిడి ఎప్పుడో..!

నల్గొండ : పేదలకు మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్రచికిత్స ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఆరోగ్య శ్రీ పథకం కింద చేర్చి రూ. 1.50లక్షల వరకు నిధులు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేటు ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేస్తే రూ. 3-4 లక్షల వరకు ఖర్చు అవుతోంది. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో దీని కోసం అన్ని రకాల వసతులు కల్పించారు. అయినా నేటికి ఒక్క మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్రచికిత్స చేయకపోవడం గమనార్హం. బాధితులు శస్త్రచికిత్సల కోసం వార్డుకు వస్తే వారిని ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేసి వైద్యులు చేతులు దులుపుకొంటున్నారు.

**ఏడాది క్రితమే వార్డు ఏర్పాటు..**

జనరల్ ఆసుపత్రిలో మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్రచికిత్సకు ఏడాది




క్రితం రూ. 20 లక్షలు ఖర్చు చేసి ప్రత్యేక విభాగం తయారు చేశారు. ప్రజాప్రతినిధులు దీనిని ప్రారంభించి మూడు నెలలు దాటింది. ప్రస్తుతం ఈ విభాగంలో 18 మంది ప్రొపెసర్లు పనిచేస్తున్నారు. వారిలో ఇద్దరు ప్రొపెసర్లు మోకాళ్ల మార్పిడిపై రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. వైద్యాధికారుల సమన్వయ లోపంతో శస్త్రచికిత్సలు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యవిధాన పరిషత్ పరిధిలోని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో గడిచిన ఆరు నెలల్లో 12 శస్త్రచికిత్సలు జరిగినట్లు సంబంధిత అధికారుల చెబుతున్నారు. ఇక్కడ ప్రొఫెసర్లు, ఉన్నత స్థాయి విభాగాధిపతులు ఉన్నా ఒక్క శస్త్రచికిత్స జరగకపోవడం శోచనీయం.

త్వరలో నిర్వహిస్తాం: డా. అరుణకుమారి, ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్జనరల్ ఆసుపత్రిలో మెకాళ్ల చిప్పల మార్పిడి శస్త్రచికిత్సలు జరగని మాట వాస్తవమే. మరికొన్ని పరికరాలు అవసరం ఉంది. వాటిని సమకూర్చుకుని త్వరలో సేవలు ప్రారంభిస్తాం.

# సైబర్ నేరాల కట్టడికి 'చక్షు'

మునగాల : డిజిటల్ ప్రపంచంలో సైబర్ నేరగాళ్లు రోజుకో రకం మోసం చేస్తున్నారు. చరవాణి ద్వారా ప్రజలను తేలికగా మోసం చేస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఇలాంటి నేరాలన్నింటికీ చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చక్షు పేరుతో ఓ కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

హిందీలో చక్షు అంటే కన్ను అని అర్థం. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ విభాగం చక్షు-రిపోర్టు సస్పెక్టెడ్ ఫ్రాడ్, అన్‌సాలిసిటేడ్ కమర్షియల్ కమ్యూనికేషన్ అనే పోర్టల్‌ను ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చింది. అనుమానిత, మోసపూరిత కాల్స్, సందేశాల వివరాలను ఇందులో నమోదు చేయవచ్చు.

**ఎలా ఫిర్యాదు చేయాలి...** ఫిర్యాదు చేయడానికి ముందు 'సంచార్‌సాథి' పోర్టల్‌లోకి వెళ్లాలి. అందులో ఉన్న సిటిజన్ సెంట్రిక్ సర్వీసెస్‌లోకి వెళ్లి చక్షు ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మనకు వచ్చిన మోసపూరిత ఫోన్, వాట్సప్ మెసేజ్ వంటి వివరాలను, వచ్చిన తేదీ, సమయాన్ని పోర్టల్‌లో నమోదు చేయాలి. అనంతరం వ్యక్తిగత పేరు, ఫోన్ నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. దాన్ని పొందుపరిచిన అనంతరం ఫిర్యాదు పూర్తవుతుంది.

# ఆకురాలే కాలం... అగ్గిరేఖలు అవసరం



సిరిసిల్ల : పచ్చని అందాలు పంచిన వనాలు జనవరి చివరి వారంలో వాతావరణంలో మార్పుతో ఆకు రాలుస్తున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు నెమ్మదిగా పెరుగుతున్నాయి. నేలపై రాలిన ఆకుల్లో అగ్గి రాజుకుంటే అడవికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ముందస్తు చర్యలతో ఈ ప్రమాదాలను అరికట్టేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. లేకుంటే వేసవికాలంలో అడవుల్లో మంటలు ఎగిసిపడితే తీవ్ర నష్టం ఏర్పడుతుంది.

జిల్లాలో రెండు రేంజ్‌ల పరిధిలో సుమారు 33 వేల హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలో 12 సెక్షన్లు, 44 బీట్‌లు ఉన్నాయి. ప్రధానంగా రుద్రంగి, చందుర్తి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, కోనరావుపేట మండలాల్లో అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉంది. కామారెడ్డి, నిజామాబాదు, సిద్దిపేట, జగిత్యాల జిల్లాల సరిహద్దుల వరకు అటవీ ప్రాంతం ఉంది. ప్రధానంగా ఆకురాల్చే అడవులే ఉండగా ప్రస్తుతం సీజన్ మొదలైంది. ఫిబ్రవరిలో సైతం అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భాలున్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో ముందస్తుగా పనులు చేపడితే చాలా వరకు ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది. పంచాయతీ కార్యదర్శులకు సైతం వనాల్లో మంటలు ఆర్పివేయించే బాధ్యతను అప్పగించారు.

ఉపయోగాలు ఇలా...వేసవికాలంలో అడవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్గిరేఖలు ఉపయోగపడుతుంటాయి. మంటల వ్యాప్తిని చాలా వరకు కట్టడి చేస్తుంటాయి. రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫైర్‌లైన్‌తో రహదారి పక్కన సిగరెట్టు, బీడీలతో కలిగే ప్రమాదాలు చాలా వరకు రేఖల వద్ద ఆగిపోతుంటాయి. మీటరుకు పైగా వెడల్పుతో ప్రతి వంద మీటర్లకు చొప్పున డబ్బా ఆకారంలో 100 వేస్తారు. ఒకవేళ ఆ ప్రాంతంలో అంటుకున్న మంటలు అక్కడికే పరిమితమవుతాయి.

కారణాలు ఇవీ...

అడవుల్లో మంటలు వ్యాప్తి చెందేందుకు ధూమపానం అలవాటున్న కొందరు ఆకతాయిలు కారణమవుతున్నాయి.

వేసవిలో కలప తరలించే ముఠాలు ఆకులు చప్పుడు కాకుండా నిప్పుపెడుతుంటాయని సమాచారం.

మార్చిలో తునికాకు ఆ తర్వాత ఇప్పపువ్వు ఇప్పపరక వంటి అటవీ ఫలాలు లభిస్తుంటాయి. అయితే విష పురుగుల బారిన పడకుండా, సులువుగా అటవీ ఫలాలను సేకరించేందుకు వనాలకు అగ్గిపెడుతుంటారు.

ఒకచోట రాజుకున్న అగ్గి అడవంతా వ్యాప్తి చెందుతుంది. దీంతో విలువైన ఔషధ మొక్కలు, వృక్ష జాతులు, అరుదైన జీవ జాతులు అంతరించిపోతుంటాయి.

వనాన్ని ఆవాసంగా మలచుకున్న జీవరాశుల మనుగడ చెదిరిపోతుంది. వన్యప్రాణులు ఆవాసాలు కోల్పోయి పంట పొలాలు, గ్రామాల్లోకి వస్తుంటాయి. ఇలాంటి నష్టాన్ని అరికట్టేందుకు అగ్గిరేఖలే అసలైన ఆయుధం.

ఫిబ్రవరి నుంచి పనులు మొదలు పెడితే భవిష్యత్తులో ముప్పువాటిల్లకుండా ఉంటుంది.

ప్రజల భాగస్వామ్యం అవసరం

విలువైన అటవీ సంపద పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఉండాలి. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే అటవీశాఖ, పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. మంటలు అదుపులోకి తీసుకొచ్చేందుకు సామాజిక బాధ్యతగా మెలగాలి. అటవీశాఖ సిబ్బందికి సహాయం చేయాలి. దూరం నుంచి మంటలు ఆపే చర్యలు తీసుకోవాలి. జిల్లాలో అగ్గిరేఖలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వేగవంతంగా పూర్తి చేసి అడవికి నష్టం కలగకుండా పకడ్బందీగా ఏర్పాటు చేస్తాం.కల్పనదేవి, అటవీక్షేత్రాధికారి సిరిసిల్ల

# బృహత్తర ప్రణాళికకు వేళాయె



కోరుట్ల : కోరుట్ల పట్టణంలో 2010లో అప్పటి ప్రభుత్వం మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మాస్టర్ ప్లాన్ (బృహత్తర ప్రణాళిక)ను రూపొందించారు. ప్లాన్ ప్రకారంగా జోన్‌లు, రోడ్ల విస్తీర్ణం, ఇతర అంశాలను నిర్ణయించారు కానీ.. ప్లాన్‌ను ఇప్పటి వరకు అమలు చేసిన దాఖలాలు లేకుండా పోయాయి.

**డ్రోన్ సర్వేతో హద్దుల గుర్తింపు**

కోరుట్ల పట్టణంలో సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అమృత్ 2.0 కింద ప్రత్యేక బృంద సభ్యులు ఇటీవల డ్రోన్ సర్వేను పూర్తి చేశారు. పట్టణంలో 33 వార్డులు, మొత్తం 22,115 ఇళ్లు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా 69,479 (ప్రస్తుతం సుమారు 86,000) ఉంటుంది.

2040వ సంవత్సరం వరకు పట్టణంలో పెరిగిన జనాభాకు ఉపయోగపడేలా మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు ప్రభుత్వం శాశ్వత చర్యలు చేపట్టనుంది.

పట్టణం మొత్తం 32.8 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించినట్లు గుర్తించారు.

పట్టణం చుట్టూ 10 కిలోమీటర్ల వరకు బఫర్‌జోన్‌గా నిర్ణయించారు.

ఈ విస్తీర్ణాన్ని జీఐఎస్ (జియోగ్రఫీ ఇన్స్ట్రుమెంట్ సిస్టమ్) ఆధారంగా మొత్తం 48 సర్వే పాయింట్ (హద్దు)లుగా గుర్తించారు.

మెట్‌పల్లి పట్టణంలో సర్వే ఇంకా కొనసాగుతోంది.

జీఐఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన సర్వే తుది పట్టణ మ్యాప్‌లను త్వరలో రూపొందించనున్నట్లు పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ప్రవీణ్ పేర్కొన్నారు.

మార్చాలని నిర్ణయించినా..

ప్రభుత్వం కోరుట్ల మున్సిపల్ దగ్గర్లో ఉన్న ఏఖీన్‌పూర్ గ్రామ పంచాయతీని 2018లో విలీనం చేసింది. కోరుట్ల పట్టణ విస్తీర్ణం, జనాభా పెరగడంతో పాత మాస్టర్ ప్లాన్ మార్చాలని నిర్ణయించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం పట్టణాల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో అమృత్ 2.0 అమలు చేయాలని నిర్ణయించింది. 2040 వరకు పెరగనున్న జనాభా, ప్రజల నివాసానికి అనుగుణంగా ఉండేలా కోరుట్లలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు, జోన్‌లు, కావాల్సిన విస్తీర్ణం, రోడ్ల విస్తరణ ఉండేలా నూతన మాస్టర్ ప్లాన్ అమలు చేసేలా ప్రత్యేక సర్వేలు చేయాలని ఆదేశించింది.

# 'చేనేత'లను ఎప్పుడు ఎన్నుకుంటారో..?



చౌటుప్పల్ : చేనేత, మరమగ్గాల, ఉన్ని పారిశ్రామిక సహకార సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించి పుష్కరం దాటింది. ఈ ప్రభుత్వం కూడా ఎన్నికలు నిర్వహించే సూచనలు కనిపించడం లేదని చేనేత పారిశ్రామికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2013 ఫిబ్రవరి 12న ఎన్నికలు నిర్వహించారు. ఈ సంఘాల పదవీకాలం అయిదేళ్లే. 2018 ఫిబ్రవరి 11తో ఎన్నికైన పాలకవర్గం పదవీకాలం ముగిసింది. ఎన్నికలు నిర్వహించకుండా ప్రతి ఆర్నెళ్లకోసారి చొప్పున ప్రభుత్వం పొడిగిస్తూ వస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఈసారి ఎన్నికలు నిర్వహిస్తారని, నూతన పాలకవర్గాలను ఎన్నిక చేసి సహకార సంఘాలకు జీవం పోస్తారని చేనేత పారిశ్రామికులు ఆశించారు. ఎన్నికలు నిర్వహించాలంటే నలభై రోజుల ముందే ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. తెలంగాణ వ్యాప్తంగా చేనేత, సిల్క్, ఉన్ని, మరమగ్గాల సహకార సంఘాలు 375 వరకున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే 85 సంఘాలున్నాయి. 2018లో అన్ని చేనేత సహకార సంఘాల్లో ఓటు హక్కుకు అర్హత ఉన్న చేనేత పారిశ్రామికుల జాబితాలను చేనేత, జౌళి శాఖ సిద్ధం చేయించింది. ఎన్నికలు నిర్వహించాలంటే తాజా జాబితాలను సవరించేందుకు అవకాశమివ్వాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన చేనేత అభయహస్తం పథకం సద్వినియోగం చేయించేందుకు సహకార స్ఫూర్తితో నెలకొల్పిన ఈ సంఘాలకు సమర్ధవంతమైన, పట్టుదల, అంకితభావం, దార్శనికత గల పాలకవర్గాలను ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు...

పద్మ, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, చేనేత, జౌళి శాఖ

చేనేత సహకార సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఆదేశాలు రాలేదు. ఆదేశాలు జారీ చేస్తే ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తాం. అయిదేళ్ల పదవీ కాలానికి 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించారు. వారి పదవీ కాలం ముగిశాక సహకార చట్టం ప్రకారం పర్సన్ ఇన్‌ఛార్జిలుగా నియమించారు. వారి నియామకాన్ని ఆర్నెళ్లకు ఒకసారి ప్రభుత్వం పొడిగిస్తూ ఉంది.

# కొత్త బంగారు లోకం..!

ఖమ్మం : ఉన్నత పాఠశాల స్థాయిలోని కౌమార దశ విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ అంశాల పరంగా బాలబాలికలకు సలహాలు, సూచనలు ఇవ్వాలని నిర్ణయించింది. వారిలో అపోహలు, భయాందోళనలనూ తొలగించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో 230, భద్రాద్రి జిల్లాలో 126 ఉన్నత పాఠశాలల నుంచి ఒక్కో ఉపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయిని ఖమ్మంలోని జిల్లా విద్యా,శిక్షణ సంస్థ(డైట్) కళాశాలలో తర్ఫీదు పొందారు. ఎనిమిది అంశాలపై శిక్షణ సాగింది. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు వివరించి వారిలో ఆత్మస్థైర్యం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తారు.

**కౌన్సెలింగ్ అండ్ కెరీర్ గైడెన్స్**

పదోతరగతి తర్వాత విద్యార్థులకు ఎన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయనే వివరాలు వెల్లడిస్తారు. విద్యావకాశాలనూ వివరిస్తారు.

**బేసిక్ కౌన్సెలింగ్ నైపుణ్యాలు**

పరీక్షల పట్ల విద్యార్థుల్లో భయాందోళనను పోగొడతారు. మానసిక ఉద్వేగాల నియంత్రణకు అనుసరించాల్సిన పద్ధతులను విడమరిచి చెబుతారు.



**కౌమార దశలో సమస్యల పరిష్కారం**

ఉన్నత పాఠశాలల విద్యార్థులు 10-16 సంవత్సరాల వయసు కలిగి ఉంటారు. బాల్యం నుంచి యవ్వన దశలో అడుగుపెట్టే సమయం. ఈ దశలో శారీరక, మానసిక భావోద్వేగాల పెరుగుదల వేగంగా ఉంటుంది. ఇలాంటి మార్పుల గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరిస్తారు.

**వైకల్య లక్షణాల గుర్తింపు**

కౌమార దశలో మానసిక స్థితుల ఆధారంగా వారిలో కనిపించే వైకల్య లక్షణాలు, వాటి నివారణ ఉపాయాలను సూచిస్తారు.

**కెరీర్ ఆప్షన్స్**

ఇటీవల కాలంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును విద్య, వైద్యరంగాల్లో ఉపయోగిస్తున్నారు. డిజైనింగ్, సివిల్, సివిల్స్, ఆర్మీ, నేవీ తదితర రంగాల్లోనూ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఉపాధ్యాయులు విడమరిచి చెబుతారు.

**ఒత్తిడి నుంచి దూరం**

దైనందిన జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్ల నుంచి విద్యార్థులు ఎలా బయటపడాలో వివరిస్తారు. ఆందోళనను నియంత్రించే మార్గాల గురించి చెబుతారు. విద్య, ఉపాధి పట్ల సానుకూల దృక్పథం అలవడేందుకు కృషిచేస్తారు.

**పరీక్ష సాధన సూత్రాలు**

పదోతరగతి విద్యార్థులకు ఉత్తమ పరీక్ష సాధన సూత్రాలను వివరిస్తారు. తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన నియమాలు, సమయపాలన, సామాజిక బంధాలు, బాంధవ్యాల గురించి తెలియజేస్తారు.

**వివిధ రకాల కోర్సులపై అవగాహన**

పదోతరగతి తర్వాత చాలామందికి ఇంటర్మీడియట్ కోర్సు గురించి మాత్రమే తెలుసు. ఇతర అనేక వృత్తి విద్యాకోర్సుల గురించి అవగాహన ఉండదు. ఇలాంటి వాటి గురించి ఉపాధ్యాయులు వివరిస్తారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు తొలుత ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. ఇలాంటి వారంతా కౌన్సెలర్లుగా వ్యవహరిస్తూ విద్యార్థులకు తమ బలాలు, బలహీనతలను తెలియజేస్తారు. ఉద్యోగ, ఉపాధి, విద్యావకాశాల గురించి వివరిస్తారు. భవిష్యత్తులో ఆసక్తిగల రంగాలను విద్యార్థులు ఎంచుకునేలా తోడ్పాటునందిస్తారు. పెసర ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర రిసోర్స్ పర్సన్

# పైపైకి ఉబ'గంగ'

ఖమ్మం : జిల్లాలో ఈ ఏడాది జనవరి నెల ముగిసే సరికి సగటున 4.49 మీటర్ల లోతులో భూగర్భజలాలు అందుబాటులో ఉన్నాయి. 2024 జనవరిలో 5.46 మీటర్ల లోతులో ఉండగా.. గతేడాది కన్నా ఈసారి 0.97 మీటర్ల మేర భూగర్భ జలమట్టం పెరిగింది. ఈఏడాది సమృద్ధిగా వర్షాలు కురవటంతోపాటు సాగర్ కాల్వల ద్వారా నీరు ప్రవహిస్తున్నందున భూగర్భ జలమట్టం ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం ఖమ్మం అర్బన్ మండలంలో మాత్రం భూగర్భ జలమట్టం



తగ్గుముఖం పటింది. 2024 జనవరిలో 1.32 మీటర్ల లోతులో ఉన్న నీరు 2025 జనవరిలో 1.77 మీటర్ల లోతుకు జారిపోయింది. అంటే 0.45 మీటర్ల లోతుకు దిగిపోయింది. కామేపల్లి మండలంలో 0.05 మీటర్లు, వైరా మండలంలో 0.26 మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టం జారిపోయిందని భూగర్భజలశాఖ అధికారి విష్ణు తెలిపారు. జిల్లాలో మిగతాచోట్ల భూగర్భజలాలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు.

# చెదిరిన కలలు

జగిత్యాల : యువ పోలీసు అధికారి ఒకరు.. బ్యాంకు ఉద్యోగి మరొకరు.. చిన్న వయసులోనే మృతి చెందడం అందరినీ కలచి వేసింది.. వృత్తిలో, జీవితంలో ఎంతో ఎదగాల్సిన వారు మృత్యువాత పడటం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల జిల్లా క్రైమ్ రికార్డుల బ్యూరో (డీసీఆర్బీ) ఎస్సై కొక్కుల శ్వేత, ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి మల్యాల నరేష్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను మరణోత్తర పరీక్షల నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తీసుకురాగా కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్ పలువురు పోలీసు అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆసుపత్రిలో కుటుంబసభ్యులను ఓదార్చారు.

**రెండు కుటుంబాల్లో విషాదం**

చొప్పదండి మండలం అర్నకొండకు చెందిన శ్వేత 2016లో కానిస్టేబుల్‌గా ఎంపికై సిరిసిల్ల జిల్లాలో విధులు నిర్వహించారు. 2019లో ఎస్సైగా ఎంపికైన తరవాత జగిత్యాల జిల్లాలోని పలు ఠాణాల్లో పని చేశారు. ప్రస్తుతం డీసీఆర్బీలో విధులు నిర్వహిస్తున్న ఆమె ఉన్నత స్థాయికి ఎదుగుతున్న తరుణంలో తిరిగిరాని లోకానికి వెళ్లడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు తల్లడిల్లిపోయారు. 'మమ్మల్ని విడిచిపోయావా బిడ్డా' అంటూ రోదించారు. మల్యాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన నరేష్ పేద కుటుంబానికి చెందినవారు. తండ్రి నర్సయ్య వ్యవసాయ కూలీ కాగా.. తల్లి లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతోంది. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలోని ఓ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న ఆయన తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేందుకు ప్రతిరోజు ఇంటి నుంచే వెళ్లి వస్తున్నారు. కొన్నాళ్లు బస్సులో వెళ్లి వచ్చినప్పటికీ కొన్ని రోజుల నుంచి ద్విచక్రవాహనంపై దగ్గరి మార్గం ద్వారా లక్సెట్టిపేటకు వెళ్తున్నారు. చేతికందిన కొడుకు కానరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మరణోత్తర పరీక్షల అనంతరం మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్సై శ్వేత స్వగ్రామం ఆర్నకొండలో పోలీసుల గౌరవ వందనంతో అంత్యక్రియలు నిర్వహించారు. జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) భీమ్‌రావు, డీసీఆర్బీ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రఫీఖ్‌ఖాన్‌తోపాటు పలువురు పోలీసు అధికారులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరేష్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లిన కుటుంబసభ్యులు, దుబాయి నుంచి అతడి సోదరుడు వచ్చిన తర్వాత బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

# ఊరంతా ఏకమై.. పునర్నిర్మాణంలో భాగమై

కోదాడ : మునగాల మండలం తాడువాయి గ్రామంలోని గురప్ప ఆలయానికి చరిత్ర ఉంది. గురప్ప స్వామిని తమ కుల దైవంగా భావించే యాదవులు ఈ ఆలయాన్ని గత మూడేళ్లుగా దాతల సాయంతో సుమారు రూ.95 లక్షలు వెచ్చించి పునర్నిర్మించారు. ఈ నెల 8న ధ్వజస్తంభం, గురప్ప స్వామి విగ్రహాల పున:ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులంతా వేడుకల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కాకతీయుల కాలంలోనే గురప్ప ఆలయం వెలిసిందని, ఏళ్ల చరిత్ర గల గుడి అని గ్రామస్థులు చెబుతారు. చివరి సారిగా 2014లో ఉత్సవాలు జరగగా, 11 ఏళ్ల తర్వాత



దేవాలయాన్ని పునర్నిర్మించి గ్రామస్థులంతా కలిసి ఈ నెల 6, 7 తేదీల్లో ప్రత్యేక పూజలు, 8న నూతన విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆలయ సన్నిధిలో ప్రతిష్ఠించనున్న రాతి ధ్వజస్తంభాన్ని గ్రామస్థులు ప్రత్యేకంగా తయారు చేయించారు. ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం సమీపంలోని బండ నుంచి ప్రత్యేకంగా చేయించిన ధ్వజస్తంభాన్ని ఊరేగింపు అనంతరం ప్రతిష్ఠించనున్నారు. గ్రామంలో ఇదే మొదటి ధ్వజస్తంభం కావడం విశేషం. ఐదో తరం వారసుడిగా గుడి నిర్మాణంలో భాగం కావడం ఆనందంగా ఉందని, దేవాలయ నిర్మాణానికి తన వంతుగా రూ.11 లక్షలకు పైగా సాయం అందించానని కమిటీ నిర్వాహకుడు రామిరెడ్డి తెలిపారు.

# ఉత్పత్తి భళా.. రవాణాలో డీలా..!

మణుగూరు : మణుగూరు ఏరియా నుంచి బొగ్గు రవాణా పెరిగేందుకు అన్ని ఆటంకాలే ఏర్పడుతున్నాయి. ఏరియాలో రోజుకు 45 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుండగా, 40 వేల టన్నుల బొగ్గు మాత్రమే రవాణా అవుతుంది. అంటే రోజుకు 5 వేల టన్నుల బొగ్గు రవాణా జరగకుండా మిగులుతుంది.వరకు అన్ని గనుల్లో 3 లక్షల టన్నుల బొగ్గు నిల్వ ఉంది. అంత బొగ్గు నిల్వ ఉండటంతో సింగరేణికి ఏమి చేయాలో అంతుపట్టడం లేదు. వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం గడువు ఇంకా రెండు నెలలే మిగిలింది. ఎంత బొగ్గు ఉత్పత్తి చేస్తే అంత సరకును రవాణా చేయాలి. గడువులోపు బొగ్గును రవాణా చేయలేకపోతే వచ్చే ఏడాది వార్షిక లక్ష్యంలో చూపాల్సి ఉంటుంది.

**బీటీపీఎస్‌కు తగ్గటంతోనే..**

బీటీపీఎస్‌లో మూడు యూనిట్లు మాత్రమే నడుస్తున్నాయి. మొదటి యూనిట్ అందుబాటులోకి రావటానికి ఇంకా సమయం పడుతుంది. నాలుగు యూనిట్లు పనిచేస్తే రోజుకు 14 వేల టన్నుల అవసరం అవుతుంది. కానీ ప్రస్తుతం 9,500 టన్నుల బొగ్గు మాత్రమే రవాణా అవుతుంది. బీటీపీఎస్ వద్ద 2 లక్షల టన్నుల బొగ్గు నిల్వ ఉండటంతో ఎక్కువ రవాణా చేయలేని పరిస్థితి నెలకొంది.

**రైల్వే నుంచి స్పందన కరవు**

రోజూ ఉత్పత్తి అయిన బొగ్గును బీటీపీఎస్‌తోపాటు, రైలు ద్వారా పరిశ్రమలకు తరలివెళ్తుంది. అయితే రోజుకు 9 రేకుల ద్వారా బొగ్గును రవాణా చేసే సామర్థ్యం ఉన్నా 7 రేకుల ద్వారా మాత్రమే బొగ్గు వెళుంది. 59 పెట్టెలు అయితే ఒక రేకు అవుతుంది. ఒక రేకు ద్వారా 4 వేల టన్నుల బొగ్గు రవాణా అవుతుంది. అయితే రోజుకు 9 రేకులు ఇవ్వాలని సింగరేణి కోరుతున్నా రైల్వే శాఖ నుంచి స్పందన లేదు. స్వల్ప స్థాయిలో బొగ్గు రవాణా అవటానికి రేకులు తక్కువగా ఉండటమూ మరో కారణంగా చెప్పవచ్చు.

# భవితకు భరోసా.. యువత కులాసా



రామడుగు : నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎంఈజీపీ (ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం) పథకం అమలు చేస్తోంది. పలు పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి లభించనుంది. దీని ద్వారా వివిధ రకాల యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు వచ్చేవారికి రాయితీ అందజేస్తోంది. పథకం ఉద్దేశం, జిల్లాకు మంజూరైన యూనిట్లపై కథనం.

**ఉత్పత్తి పరిశ్రమలకు రూ.50 లక్షలు**

పీఎంఈజీపీ పథకంలో యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకుల సహకారంతో రాయితీతో కూడిన రుణాలు అందజేస్తారు. ఇందులో ఉత్పత్తి, ఉత్పత్తేతర అంటే సర్వీస్ పరిశ్రమలకు ఆర్థిక సాయం అందజేస్తారు. ఉత్పత్తి పరిశ్రమలకు రూ.50 లక్షలు, సేవా రంగానికి రూ.20 లక్షలు ఇస్తారు. ఇందులో ఆయా వర్గాలను బట్టి 5 నుంచి 35 శాతం రాయితీ వర్తిస్తుంది.

**పథకం ఉద్దేశం**

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులైన యువతకు స్వయం ఉపాధి కొత్త ప్రాజెక్టులు, కుటీర పరిశ్రమలకు అవకాశం కల్పించడం సంప్రదాయ వృత్తుల్లో ఉన్నవారికి నిరంతరం ఉపాధి కల్పిస్తూ వలసలు వెళ్లకుండా చూడటం.. జీవన ప్రమాణాలు మెరుగుపరచడం.

**ఎందులోనైనా అవకాశం**

ఈ పథకం ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ పర్యవేక్షణలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమీషన్ ద్వారా అమలు చేస్తోంది. స్వయం ఉపాధి పథకాల ఏర్పాటుకు ముందుకొచ్చే యువతకు రాయితీ అందజేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ), గ్రామీణ పరిశ్రమల బోర్డు(కేవీఐబీ), జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ)ల ద్వారా ఈ పథకం అమలు చేస్తున్నారు. ఈ మూడు ఏజెన్సీల్లో ఎందులోనైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

**అర్హతలు**

18 ఏళ్లు పైబడినవారు సర్వీసు పరిశ్రమకు 8వ తరగతి, తయారీ పరిశ్రమకు ఆపై విద్యార్హతలుండాలి. ఆసక్తి గలవారు %http///kvionline.gov.in% లో ఏజెన్సీ (డీఐసీ, కేవీఐసీ, కేవీఐబీ)ని ఎంపిక చేసుకోవాలి. అర్హతలు, ప్రాజెక్ట్ రిపోర్టు, ఇతర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. పీఎంఈజీపీలో ప్రాజెక్టులు స్థాపించడానికి ఎలాంటి రుణ పరిమితి లేదు. లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాల మంజూరుకు బ్యాంకులకు జాబితా పంపిస్తారు. యూనిట్లు గ్రౌండింగ్ అయిన తర్వాత రాయితీని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు.

# స్త్రీనిధి రుణాలు స్వాహా



రామడుగు : మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించేందుకు తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తోంది ప్రభుత్వం. క్షేత్రస్థాయిలో కొందరి పర్యవేక్షకుల వైఖరితో చాలామంది సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. సర్కారు డబ్బులు కాజేస్తున్న ఘటనలు అక్కడక్కడ వెలుగుచూస్తున్నాయి. తాజాగా రామడుగు మండలంలో 'స్త్రీనిధి' రుణాలు పక్కదారి పట్టిన విషయం వెలుగులోకి వచ్చింది.

మండలంలోని సభ్యుల ఆర్థికావసరాల మేరకు గతేడాది ప్రభుత్వం రూ.2.5 కోట్ల 'స్త్రీనిధి' రుణాలు విడుదల చేసింది. రుణ వసూళ్ల పర్యవేక్షణ బాధ్యత సీఏలు చేపడుతున్నారు. ఏడాది కాలంగా రామడుగు సీఏ ఒకరు గ్రామైక్య సంఘం నిధులు, రుణ వసూలు మొత్తం సొంతానికి వాడుకోవడంతో ఆందోళన మొదలైంది.

సుమారు రూ.13 లక్షల మేరకు లెక్కతేలక పోవడంతో రుణగ్రహీతలు తలలు పట్టుకుంటున్నారు. దీనిపై సదరు సీఏను నిలదీయగా మహిళా సంఘాల సభ్యులకు హామీపత్రం అందజేసినట్టు సమాచారం. ఇంకా గ్రామైక్య సంఘానికి చెందిన సుమారు రూ.8 లక్షల స్త్రీనిధి నిధులు సదరు సీఏ జమ చేయాల్సి ఉంది. మొత్తం రూ.21 లక్షలు ఏం చేశారో తేలాల్సి ఉంది.

స్వాహా పర్వం వెలుగుచూడటంతో సెర్ప్ అధికారులు రామడుగులో ఇంటింటికి తిరిగి రుణ గ్రహీతల చెల్లింపు వివరాలు సేకరించారు. ఇందులో చాలామంది రుణ గ్రహీతలు తమ స్త్రీనిధి అప్పు నేరుగా చెల్లించకుండా సీఏలకు నగదు అందజేశారు. అయితే నమ్మకంగా పని చేయడంతో రసీదు తీసుకోకపోవడంతో మహిళలు స్వాహా పర్వంతో వేదన చెందుతున్నారు.

యూపీఐ ద్వారా చెల్లించే అవకాశమున్నా.. అంతగా అవగాహన లేక నగదు చెల్లింపుపై ఆధారపడ్డారు. అయితే ఒక సీఏ స్త్రీనిధి డబ్బులు సొంతానికి వాడుకోవడంతో మిగతా మహిళా గ్రూపుల్లోనూ ఇదే చర్చ జరుగుతోంది. స్త్రీనిధి రుణాలపై దృష్టి సారించిన సెర్ప్ అధికారులు దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. సదరు వ్యవహారం వెలుగు చూసినా డబ్బుల రికవరీపై స్తబ్దత నెలకొనడంతో మహిళా సంఘాల్లో ఆందోళన నెలకొంది. రామడుగు సెర్ప్ ఏపీఎం ప్రభాకర్‌ను వివరణ కోరగా.. స్త్రీనిధి డబ్బులు చెల్లించాలని సీఏకు నోటీసు జారీ చేశామన్నారు.

మండలంలో వివరాలు..

గ్రామాలు : 23

మహిళా సంఘాలు : 1150

సభ్యులు : 12 వేలు

గ్రామైక్య సంఘాలు, సీఏల సంఖ్య : 46

# మిర్చి పంటకు వేరుకుళ్లు తెగులు



కోనరావుపేట : మెట్ట ప్రాంతంలో వర్షాధారంగా మిర్చి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది నష్టాలు తప్పడం లేదు. పంట చేతికందే దశలో వేరుకుళ్లు తెగులు సోకి మొక్కలు చనిపోతున్నాయి. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. ఫలితంగా ఆదాయం గణనీయంగా తగ్గనున్నది. జిల్లాలో ఈ ఏడాది 236 ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. కోనరావుపేట, చందుర్తి, వేములవాడ అర్బన్, వేములవాడ గ్రామీణ మండలం, బోయినపల్లి, రుద్రంగి తదితర మండలాల్లోని నల్లరేగడి భూముల్లో సాగు చేశారు.

పంట సాగుకు దుక్కులు దున్నడం, విత్తనాలు వేయడం, చీడపీడల నివారణకు క్రిమిసంహారక మందుల పిచికారీ, ఎరువులకు ఎకరానికి రూ.80 వేలకు పైగా వ్యయమైంది.

ప్రతికూల వాతావరణం వల్ల ఈ ఏడాది మొక్కలు ఎర్రబారడం, దోమకాటు బారిన పడి పంట ఆశాజనకంగా లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా మిర్చి పంటకు వేరుకుళ్లు తెగులు సోకింది.

పంట చేతికందే సమయంలో తెగులు సోకడం వల్ల పూత, కాత ఎండిపోవటంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. తెగులు నివారణకు రైతులు ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కడం లేదు.

పంట దిగుబడి తగ్గిపోయిందినేను ఎనిమిది ఎకరాల్లో పత్తి, రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. గత ఏడాది మిర్చి సాగుకు వాతావరణం అనుకూలించడంతో ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా రూ.20–30 వేల వరకు ధర పలికింది. ఈ ఏడాది ఎకరానికి 10–15 క్వింటాళ్లు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.30 వేలకు పైగా పెట్టుబడి ఎక్కువైంది.

కంకణాల ఆశయ్య, రైతు, మారుపాక

మద్దతు ధర రూ.25 వేలు ప్రకటించాలి

నేను ఎకరం విస్తీర్ణంలో మిర్చి సాగు చేశాను. పంట చేతికందే సమయంలో పూత, కాయ దశలో వేరుకుళ్లు తెగులు సోకి 10 గుంటల విస్తీర్ణంలో మొక్కలు ఎండిపోతున్నాయి. నివారణకు చాలా ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సాగుకు, పంట సేకరణకు కూలీలకు ఎకరానికి రూ.1.20 లక్షల వరకు పెట్టుబడి కానుంది. ప్రభుత్వం ఎండు మిర్చికి క్వింటాల్‌కు రూ.25 వేలు ప్రకటిస్తే కొంతమేర ఉపశమనం కలుగుతుంది.

ఉప్పుల శేఖర్, రైతు, మంగళ్లపల్లి

నివారణకు చర్యలు తీసుకోవాలి

వేరుకుళ్లు తెగులు సోకిన మొక్కల చుట్టూ మెటాలాక్సిల్ గానీ, కాపర్ ఆక్సిక్లోరైడ్ గానీ లీటర్ నీటికి మూడు గ్రాములు కలిపిన ద్రావణం పోయాలి. లేకుంటే పిచికారీ చేయాలి. దీనివల్ల కొంతమేరకు వేరుకుళ్లు తగ్గించటానికి దోహదపడుతుంది. అదేవిధంగా క్రిమిసంహారానికి ప్లాంటోమైసిన్ ఒక గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సందీప్, ఏవో, కోనరావుపేట

# ఆకుకూరల తోట.. పోషకాల వంట

గంగాధర : విద్యార్థులు ఆకుకూరలు సేకరిస్తున్న ఈ చిత్రం గంగాధర మండలం న్యాలకొండపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలోనిది. 202 మంది విద్యార్థులు ఉండగా అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి డిన్నర్‌లో నాణ్యమైన ఆకుకూరలు వడ్డిస్తున్నారు. పాలకూర, మెంతి, కొత్తిమీర, వేరుసెనగ, ఉల్లిగడ్డలు పండిస్తున్నారు. వీటి నిర్వహణ బాధ్యతలను ఉపాధ్యాయులు తీసుకొని పండిస్తున్నారు. నాణ్యమైన కూరలతోపాటు ఖర్చులు తగ్గాయని పాఠశాల ప్రత్యేకాధికారి పూర్ణిమగౌతమి తెలిపారు.

బూర్గుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోనూ పాలకూర, తోటకూర, కరివేపకు, మునగాకు చెట్లను పెంచి పోషకాలతో కూడిన భోజనం అందిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందిస్తున్నారు. ఒక పంట కాలం పూర్తయ్యేలోపు రెండో పంటగా విత్తనాలు వేసి జాగ్రత్తలు తీసుకోవడంతో ఏడాది పొడవునా పాఠశాల పని దినాల్లో నాణ్యమైన ఆకుకూరలు లభిస్తున్నాయి.

ఈ రెండు పాఠశాలల్లోనే కాదు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, కస్తూర్బా పాఠశాలల్లో ఆకు కూరలు, ఇతర కూరగాయలు పండిస్తూ విద్యార్థులకు నాణ్యమైన కూరలు వడ్డిస్తున్నారు. జిల్లాలో



734 పాఠశాలల్లో 56,669 మంది విద్యార్థులు చదువుకుం టున్నారు. సర్కారు బడుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా నాణ్యమైన ఆకుకూరలు వడ్డించాలని.. అదే సమయంలో ఖర్చులు తగ్గించాలని జిల్లా పాలనాధికారి పమేలా సత్పతి నిర్ణయించారు.

కిచెన్ గార్డెన్‌ను సైతం పేరు మార్చి విటమిన్ గార్డెన్‌గా నామకరణం చేశారు. సేంద్రియ పద్ధతిలో ఆకుకూరలు సాగు చేసి పెంచుతున్నారు. జిల్లాలోని 100 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా జెన్యా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విత్తనాలు, గడ్డి కలుపునకు పనిముట్లు అందజేశారు.

విద్యార్థులకు అవగాహన

పంటల సాగుపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. శాస్త్రీయంగా ఆకుకూరల నుంచి పోషకాలు ఎలా అందుతాయో వారు ప్రత్యక్షంగా తెలుసుకుంటారు. ఏ కూరగాయలు తీసుకుంటే.. ఏయే విటమిన్లు లభిస్తాయో అర్థమవుతుంది.జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి

# నిర్వహణ లోపం.. కరవైన ఆహ్లాదం

గోదావరిఖని : నగర ప్రజలకు ఆహ్లాదం పంచాలనే ఉద్దేశంతో పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉద్యానవనాల నిర్వహణ అధ్వానంగా మారుతోంది. 'అమృత్'తో పాటు వివిధ రకాల నిధులతో చేపట్టిన ఉద్యానవనాల ఏర్పాటు నిధుల లేమితో అర్ధాంతరంగా నిలిచి పోగా పూర్తయిన చోట నిర్వహణకు నోచుకోవడం లేదు. కొన్నిచోట్ల స్థలం కొరతతో పార్కులు ఏర్పాటు చేయలేదు. తమ సంస్థల్లో పనిచేసే కార్మికుల మానసిక ఉల్లాసం కోసం సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్.ఎఫ్.సి. ఎల్. తదితర సంస్థలు ఆయా ప్రాంతాల్లో ఉద్యానవనాలను ఏర్పాటు చేసుకోగా మిగతా ప్రాంతాల్లో ఉద్యానవనాల దుస్థితి అధ్వానంగా ఉంది.'అమృత్'లో అయిదు.. 'ప్రణాళిక'లో రెండు

రామగుండం నగరపాలక ప్రాంతంలో 'అమృత్' నిధులతో గౌతమిన గర్, దుర్గానగర్, గంగానగర్, ఇందిరమ్మ కాలనీ, పీకే రామయ్య కాలనీల్లో, నగరపాలక ప్రణాళిక నిధులతో టీచర్స్ కాలనీ, విఠల్‌నగర్‌లో ఉద్యానవనాలను ఏర్పాటు చేశారు. నిర్వహణను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ముందు మరో రూ. అయిదు కోట్లతో అత్యాధునిక ఉద్యానవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టగా సుమారు రూ.40 లక్షలు ఖర్చు చేశాక నిధులు లేవని వదిలేశారు. అదే స్థలంలో ఇప్పుడు ఆసుపత్రి భవన నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. విఠల్‌నగర్, దుర్గానగర్, గౌతమినగర్‌లో కొంత మేరకు బాగున్నా ఇందిరమ్మ కాలనీ, పీకే రామయ్య కాలనీల్లో నిర్వహణ ప్రహరీలకే పరిమితమయ్యాయి. ఆటవస్తువులను ఏర్పాటు చేసినా నిర్వహణ కరవైంది. గంగానగర్‌లో బోర్డుకే



పరిమితమైన ఉద్యానవనానికే పట్టణ ప్రకృతి వనం పేరిట మరో బోర్డును ఏర్పాటు చేశారు. టీచర్స్ కాలనీలో నిర్వహణ లేక విషకీటకాలకు నిలయంగా మారింది.పట్టణ ప్రగతి నిధులతో మంథనిలో ఏర్పాటు చేసిన ఎకో పార్కు నిర్వహణపై బల్దియా శ్రద్ధ పెడుతుండటంతో స్థానికులకు ఆహ్లాదం పంచుతోంది. సుమారు అయిదు ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునికంగా తీర్చిదిద్దారు.పెద్దపల్లిలో పిల్లల కోసం సుమారు 10 గుంటల స్థలంలో ఏర్పాటు చేసిన పిల్లల పార్కు నిర్వహణ లేకపోవడంతో ఆనవాళ్లు కోల్పోయింది. మరో పార్కు ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఏర్పాటు చేయలేదు.

సుల్తానాబాద్‌లో పట్టణ ప్రణాళిక నిధులు రూ.కోటి వ్యయంతో ఉద్యానవనం నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేసినా ఆచరణకు నోచుకోలేదు.

**అడుగు పెట్టాలంటేనే భయం**

టీచర్స్ కాలనీలోని పార్కులో అడుగుపెట్టాలంటేనే భయమేస్తుంది. చెట్ల పొదలు పెరగడంతో పాములు తిరుగుతున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పార్కునకు మరోవైపు ఉంటున్న కొందరు ఇళ్లలోని చెత్తను పార్కులోనే పడేస్తున్నారు. నగరపాలక అధికారులు నిర్వహణను మెరుగుపరిస్తే ఉదయం నడకకు వచ్చేవారికి, పిల్లలు ఆడుకునేందుకు సదుపాయంగా ఉంటుంది.

బి.ప్రకాశ్, టీచర్స్ కాలనీ, గోదావరిఖని

# ఇదేనా.. పుత్రోత్సాహం!

నల్గొండ : జిల్లా పెద్దవూర మండలంలో భార్యతో విడిపోయి తల్లిదండ్రుల వద్ద ఉంటున్న కుమారుడు తండ్రితో గొడవపడి, రాయితో తలపై కొట్టి నిర్దాక్షిణ్యంగా అంతమొందించాడు. నల్గొండ జిల్లా నిడమనూరులో నివాసముంటున్న దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె. పన్నెండేళ్ల క్రితమే కుమార్తెకు వివాహం జరిపించగా పిల్లలు లేరనే మనస్పర్థల కారణంగా భార్యాభర్తలు విడిపోయారు. ఆమెకు రెండో వివాహం జరిగింది. ఆ పెళ్లికి తల్లిదండ్రుల మద్దతుందనే అనుమానంతో కుమారుడు కత్తితో కన్నతల్లి గొంతు కోసి, కడుపులో పొడవడంతో ఆమె ప్రాణాలు విడిచింది. ఇటీవల సూర్యాపేట జిల్లాలో ఓ వృద్ధుడి చేయి విరిగింది. తాను సంపాదించిన ఆస్తులు అనుభవిస్తున్న కుమారులు చికిత్స చేయించేందుకు ముందుకు రాలేదు. నొప్పిని భరించలేని ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు.

మీ జీవితంలో ఇద్దరు వ్యక్తులను మర్చిపోకండి.. నిన్ను గెలిపించడానికి సర్వస్వం కోల్పోయిన నాన్నను.. ప్రతి బాధలో మీతో ఉన్న అమ్మను.
అబ్దుల్ కలాం

తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు పుట్టనేమి వాడు గిట్టనేమి..
పుట్టలోన చెదలు పుట్టవా గిట్టవా..
వేమన శతకంలోని నీతి పద్యం

అమ్మా..నాన్నలు ఆప్యాయతా సాగరం లాంటివారు. తీర్చుకోలేని నిస్వార్థ త్యాగాల రుణం వారిది. వారు లేకుంటే జన్మలేదు.. జీవితానికి వెలుగే లేదు. పస్తులుండైనా కన్న బిడ్డల కోసం కష్టాలు సహించే జీవన గమనం వారిది. అంత గొప్ప మనసున్న తల్లిదండ్రులకు పుత్రోత్సాహం లేకుండా చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు.

కళ్లు కనిపించని తల్లిదండ్రులను శ్రవణ కుమారుడు తన భుజాలపై మోసుకుంటూ వెళ్లి పుణ్యక్షేత్రాలు చూపించడం మనం పురాణాల్లో చదువుకున్నాం. అలాంటి నేలపై పుట్టిన మనలో కొందరు కన్నవారికి రాచి రంపాన పెడుతున్నారు. ఆయనలా భుజాలపై మోసుకెళ్లాలని మన తల్లిదండ్రులు చెప్పడం లేదు. చరమాంకంలో ఉన్నవారికి ఇంత కూడు, మంచి పలకరింపు ఇవే కోరుకుంటున్నారు. కానీ ఉమ్మడి జిల్లాలో వెలుగు చూస్తున్న ఘటనలు 'మాతృదేవోభవ.. పితృదేవోభవ' అన్న మాటల అర్థాలే మార్చేస్తున్నాయి. కొందరైతే వయసుడిగిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వేస్తున్నారు. కొడుతున్నారు.. చంపేస్తున్నారు. పాలు పట్టి..నీళ్లు పోసి..భుజాలకెత్తుకున్న చేతులు నేడు వారికి భారంగా పరిణమిస్తున్నాయి.

**ఎటు పోతున్నాం..**

మన తాతల నాటి కాలంలో కన్నవారిని కంటికి రెప్పలా చూసుకునే వారు. వారి అభిప్రాయాలకు ప్రాధాన్యమిచ్చేవారు. ఉమ్మడి కుటుంబాలు వారు చెప్పినట్లుగా నడుచుకునేవి. కొడుకులు, కోడళ్లు, మనువలు, మనువరాళ్లు వీరందరి మధ్య ఆనందంగా గడుపుతూ హాయిగా కన్నుమూసేవారు. నేడా పరిస్థితులేవీ..? చిన్నప్పటి నుంచి కంటికి రెప్పలా.. పిల్లల కోసం తన సంపా'ధన' జీవితం అన్నట్లుగా బతికిన నాన్న నేటి తరానికి భారమై పోతున్నాడు. మాకేం చేశావు.. ఏం సంపాదించావు..? అంటూ దూషిస్తున్నారు. మలిసంధ్యలో వారి పట్ల కుమారులు కిరాతకంగా వ్యవహరిస్తున్న ఉదంతాలు ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్నాయి. మద్యానికి బానిసైన కొందరు కొడుకులైతే వారిని హత్య చేస్తున్నారు. సేవ చేసే సమయం లేని ఇంకొందరు వృద్ధాశ్రమాల్లో వదిలేస్తున్న పరిస్థితులున్నాయి. పట్టించుకోవడం లేదని, ఆస్తిని కాజేశారని, దాడి చేశారని వృద్ధులు పోలీసులను ఆశ్రయించడం కలచి వేసే అంశమే. సమాజంలో రోజూ ఎక్కడో చోట అమ్మా..నాన్న కన్నీటిని దిగమింగుకుంటూనే ఉన్నారు.

**పంతం.. పెద్దాయన సొంతం..**

65ఏళ్లు దాటిన వారు తమ శక్తిని కోల్పోతారు. వారి ఆలోచనల్లో మార్పు వస్తుంది. ఇతరుల సాయం అవసరముంటుంది. వయసు పెరిగే కొద్దీ మొండిగా మారుతారు. ఇదే సమయంలో సంసార భారం మోస్తున్న వారి కుమారుల ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. దీంతో ఒకరి నిర్ణయాలతో ఒకరు ఏకీభవించలేరు. వారి పంతాలను నెగ్గించుకునే క్రమంలోనే గొడవలకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ కారణంగానే కుటుంబాల్లో చాలా వరకు గొడవలకు దారి తీస్తున్నాయి.

**ఇది కదా బాధ్యత..**

వృద్ధ తల్లిదండ్రుల స్థితిగతులకు అనుగుణంగా వారితో మాట్లాడాలి. వారి ఆరోగ్య, మానసిక స్థితిని అర్థం చేసుకొని ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి. ఏదైనా కోపంలో రెండు మాటలంటే కనిపెంచిన వారే కదా అని సరిపుచ్చుకోవాలి. వారి అవసరాలను గుర్తిస్తూ.. సమకూరుస్తూ.. ముందుకు సాగాలి. లోకం మెచ్చిన బిడ్డగా మీరూ ఎదగాలి.

ఇటీవల హెల్పేజ్ ఇండియా సంస్థ సర్వే ప్రకారం వృద్ధులను వేధిస్తున్న వారు (శాతాల్లో)
బంధువులు 36
కుమారులు 35
కోడళ్లు 21
ఇతరులు 8

ఉమ్మడి కుటుంబాల కనుమరుగుతోనే..
బోయపల్లి రాంశెట్టి, విశ్రాంత ప్రధానాచార్యులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాంపల్లి

# సన్నాహాలు షురూ..!



నల్గొండ : వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పదవీ కాలం ఈ ఏడాది మార్చిలో పూర్తి కానుంది. కొత్త ఎమ్మెల్సీని ఎన్నుకునేందుకు ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

**అన్ని మండల కేంద్రాల్లోనూ..** ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఉపాధ్యాయుల ఓటర్ల ముసాయిదా, తుది జాబితాలను విడుదల చేసింది. ఓటర్ల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులకు అన్ని మండల కేంద్రాల్లో 77 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2019లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా కంటే 2024 జాబితాలో ఓటర్లు అధికమయ్యారు.

**వసతులపై ఆరా..**

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ కేంద్రాల్లో వసతులపై అధికారులు ఆరా తీస్తున్నారు. తాగునీరు, విద్యుత్తు, ప్రహరీ, ర్యాంపులు, మరుగుదొడ్లు, ఉన్నాయా? లేవా పరిశీలిస్తున్నారు. వసతుల ప్రక్రియను నివేదిక రూపంలో పొందుపరుస్తున్నారు. ఒక్కో కేంద్రంలో గరిష్ఠంగా వెయ్యి మంది కనిష్ఠంగా 500 ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకున్నారు. దూరాభారం తగ్గించడంతో పాటు పోలింగ్ మెరుగయ్యేందుకు కొత్త మండలాల్లోను కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి.

**నమోదుకు అవకాశం**

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రకటన వెలువడే వరకు ఓటు నమోదు దరఖాస్తులు స్వీకరించడానికి వీలుంది. తుది జాబితా విడుదలైనప్పటికీ అర్హులైన కొత్త ఓటర్ల కోసం ఈ అవకాశం కల్పించారు. ఓటర్ల సంఖ్య ఎక్కువైతే పోలింగ్ కేంద్రాలను కూడా పెంచాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే రెండుమార్లు అవకాశం ఇవ్వగా.. ఈసారి ఎంతమంది దరఖాస్తు చేసుకుంటారో చూడాలి.

**మచ్చిక చేసుకుంటున్న అభ్యర్థులు** ఎమ్మెల్సీ ఎన్నికలు ఏప్రిల్‌లో జరిగే అవకాశం ఉండటంతో ఆయా ఉపాధ్యాయ సంఘాల నుంచి పోటీకి దిగే అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. తమకు అనుకూలమైన సంఘాల వారితో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. పట్టణాల్లో, మండల కేంద్రాల్లో ప్రధాన కూడళ్లలో అభ్యర్థుల ప్రచార ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. తమను గెలిపిస్తే పరిష్కరించనున్న ఉపాధ్యాయ సమస్యల గురించి చర్చిస్తూ హామీలు ఇస్తున్నారు.

# స్వచ్ఛ నగరానికి సింగరేణి తోడ్పాటు



గోదావరిఖని : రామగుండం నగరపాలికకు డంపింగ్‌యార్డు సమస్య తీరనుంది. మూతపడిన సింగరేణి ఉపరితల గని-4 సంబంధించిన సుమారు 10 ఎకరాల స్థలాన్ని డంపింగ్‌యార్డు ఏర్పాటుకు అప్పగించడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది. సుమారు రెండున్నరేళ్లుగా డంపింగ్‌యార్డు లేక నగరంలో ఎక్కడ పడితే అక్కడే చెత్తపడేసే పరిస్థితులు ఉన్నాయి. గోదావరి ఒడ్డున సమ్మక్క జాతర స్థలం, రామగుండం ఎరువుల కర్మాగారం పంపుహౌస్ స్థలంలో కొంతకాలంగా చెత్త వేస్తున్నారు. జిల్లా కలెక్టర్, నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్, అదనపు కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ, సింగరేణి యాజమాన్యం సహకారంతో డంపింగ్ యార్డుకు అడుగులు పడుతున్నాయి.

**ఆది నుంచి సమస్యే**

గతంలో సింగరేణి జీడీకే 11ఎ గని సమీపంలో నగరంలోని చెత్త పడేసేవారు. సుమారు రెండున్నరేళ్ల క్రితం సింగరేణి ఉపరితల గని విస్తరణలో భాగంగా డంపింగ్‌యార్డుకు ఉపయోగిస్తున్న స్థలాన్ని యాజమాన్యం స్వాధీనం చేసుకోవడంతో నగరపాలికకు డంపింగ్‌యార్డు సమస్య తీవ్రమైంది. నగరపాలిక సుమారు దశాబ్దం క్రితమే రామగుండంలోని ప్రభుత్వ స్థలంలో డంపింగ్‌యార్డును ఏర్పాటు చేశారు. ప్రహరీ నిర్మాణంతో పాటు చెత్త నిర్వహణకు అవసరమైన యంత్రాలు సైతం బిగించారు. నివాసాల పక్కనే డంపింగ్‌యార్డు ఉండటంతో స్థానికులు అడ్డుకోవడంతో పాటు కొన్నిసార్లు చెత్త ట్రాక్టర్ డ్రైవర్లపై దాడులకు పాల్పడ్డారు. దీంతో చెత్త తరలింపును నిలిపివేశారు. పి.కె.రామయ్యకాలనీ సమీపంలోని రాముని గుండాల గుట్ట పరిసరాల్లోని క్వారీల స్థలాన్ని డంపింగ్‌యార్డు కోసం రెవెన్యూ అధికారులు సూచించారు. కానీ కాలనీతో పాటు పరిసర ప్రాంతవాసులు అడ్డుకోవడంతో ఆగిపోయారు. ఆ తర్వాత లక్ష్మీపురం సమీపంలోని ఎరువుల కర్మాగారం స్థలంలో చెత్త వేస్తుండగా స్థానిక కార్పొరేటర్‌తో పాటు స్థానికులు వ్యతిరేకతతో నిలిచిపోయింది.

ఎక్కడ స్థలం లేకపోవడంతో ప్రస్తుతం గోదావరి ఒడ్డున సమ్మక్క సారలమ్మ జాతర స్థలంలో చెత్త వేస్తున్నారు. హిందూ స్మశానవాటికకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన చెత్త వేయడం, కాల్చడంతో గోదావరికి స్నానాలకు, స్మశానవాటికకు వచ్చేవారు తీవ్ర ఇబ్బంది పడేవారు. వర్షాకాలంలో చెత్త గోదావరిలో కలుస్తుండేది. గతేడాది సమ్మక్క జాతర సమయంలో చెత్తపైనే మట్టిపోయించి ఏర్పాట్లు చేశారు.

గోదావరి ఒడ్డునే రామగుండం ఎరువుల కర్మాగారానికి సంబంధించిన స్థలాన్ని డంపింగ్‌యార్డుగా వినియోగించడంతో నది కాలుష్య కారకమైంది.

# మరింత చేరువగా సహకారం



మంథని: రాష్ట్రంలో కొత్తగా దాదాపు 500 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి మండలంలో రెండు సంఘాలుండాలని భావిస్తుండగా జిల్లాలో మంథని మండలం నుంచి వెంకటాపూర్, గుంజపడుగు గ్రామాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు వెళ్లాయి. ఇవి కార్యరూపం దాలిస్తే రైతులకు సేవలు మెరుగవనున్నాయి. ప్రస్తుతం మండలంలో మంథని సహకార సంఘం ఒక్కటే ఉంది. ఇందులో 3,523 మంది రైతులు సభ్యులుండగా ఉండగా స్వల్పకాలిక రుణాల కింద 784 మందికి రూ.6.73 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద 176 మందికి రూ.5.02 కోట్లు ఇచ్చారు. 76 మంది రైతులకు వ్యక్తిగత, ఇతర రుణాల కింద రూ.25.50 లక్షలు పంపిణీ చేశారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయాలు, రుణాలపై వడ్డీలు కలిపి ఏటా సంఘానికి రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు వస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు, ఇతర వ్యాపారాలతో రూ.150 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. సంఘం పరిధిలో 35 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు రూ.2 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

**తగ్గనున్న వ్యయ ప్రయాసలు**

ప్రసుతం మంథని సంఘం పరిధిలో 35 పంచాయతీలున్నాయి. కొన్ని గ్రామాల రైతులు సంఘం కార్యాలయానికి రావాలంటే 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. కొత్త సంఘాల ఏర్పాటుతో 5 కిలోమీటర్ల దూరంలోనే కార్యాలయం ఉంటుంది. మంథని సంఘం పరిధిలో మొత్తం 3,523 సభ్యులుండగా సకాలంలో రుణాలు మంజూరు కాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొత్త సంఘాల్లో తక్కువ మంది సభ్యులుండటం వల్ల జాప్యం నివారించవచ్చు.

రైతులు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కోసం మంథనికి రావడానికి వ్యయ ప్రయాసలు ఎదుర్కోవాల్సి వస్తోంది. సమీపంలో సంఘాలుండటం వల్ల దూరాభారం తగ్గడంతో పాటు పనులు సకాలంలో జరిగే అవకాశం ఉంది. కొత్త సంఘాలతో ప్రతి గ్రామం నుంచి ఒక డైరెక్టర్ ఎన్నికయ్యే అవకాశం ఉంటుంది.

అందుబాటులో వనరులుః మంథని మండలంలో గతంలో మంథని, నాగారం, వెంకటాపూర్ సంఘాలుండేవి. నాగారం, వెంకటాపూర్ సంఘాలకు ఆదాయం లేకపోవడంతో 2009లో మంథని సొసైటీలో విలీనం చేశారు.ః కొత్తగా ఏర్పాటు కానున్న వెంకటాపూర్ సంఘం పరిధిలో వెంకటాపూర్, మల్లారం, ఆరెంద, స్వర్ణపల్లి, నాగేపల్లి, అడవిసోమన్‌పల్లి, భట్టుపల్లి, ఖానాయిపేట గ్రామాలుండగా 820 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వెంకటాపూర్‌లో రూ.26 లక్షలతో నిర్మించిన వ్యవసాయ గోదాం ఉంది. ఆరెందలో 11 గుంటల స్థలం అందుబాటులో ఉంది.

ః గుంజపడుగు సంఘం పరిధిలో గుంజపడుగు, సిరిపురం, దుబ్బపల్లి, చిల్లపల్లి, బెస్తపల్లి, ఉప్పట్ల, పోతారం, విలోచవరం, నాగారం, కన్నాల, రచ్చపల్లి, అక్కెపల్లి గ్రామాలుండగా 724 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. నాగారంలో సంఘానికి మూడు ఎకరాల స్థలం ఉంది.

# కొత్త వారికి మెప్మాలో చోటు

సూర్యాపేట : పట్టణాల్లో మహిళా సంఘంలో చేరని మహిళలకు మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) చర్యలు తీసుకుంటోంది. ప్రతి మహిళకు సభ్యత్వం కల్పించేందుకు రాష్ట్ర మెప్మాశాఖ ఆదేశాలు జారీచేసింది. సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల పురపాలికలు ఉన్నాయి. ఈ ఐదు పురపాలికల్లో 5,325 సంఘాలుండగా మొత్తం 52,493 మంది సభ్యులు ఉన్నారు. వీరితోపాటు కొత్తగా మహిళలను సంఘంలో చేరుకోవాలని ఆదేశాలు వచ్చాయి.

**సర్వే నిర్వహించి.. నమోదు చేయాలి** పట్టణంలో జనవరి చివరి వారం వరకు కొత్త వారికోసం సర్వే నిర్వహించి వారి వివరాలు అంతర్జాలంలో నమోదు చేయాలి. కాగా ఫిబ్రవరి మొదటి వారంలో వారితో సమావేశాలు నిర్వహించి గ్రూపులుగా విభజించాలి. వీరికితోడు ఇదివరకు సంఘంలో ఉండి వెళ్లిపోయిన వారిని కూడా గుర్తించి అవగాహన పర్చాలి. సంఘంలో సభ్యత్వం ఇచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళాశక్తి పథకంలో రుణాలు ఇప్పించాలి. రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని మెప్మా అధికారులు తెలిపారు.

ఇవీ ప్రయోజనాలు18 ఏళ్లు నిండి పట్టణంలోని తెల్లరేషన్ కార్డుదారులు సంఘంలో అర్హులు. సంఘంలో చేరిన మహిళలు రుణాలు పొంది వ్యాపారంలో రాణించవచ్చు. సంఘంలో రుణం పొంది ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.10 లక్షలు, సాధారణ మరణమైతే రూ.2 లక్షల వరకు బీమా ఉంటుంది. సంఘంలో చేరిన తర్వాత వ్యక్తిగతంగా రూ.3.50 లక్షలు రుణం పొందేందుకు అర్హులు.

రుణాలు పొందడం, వ్యాపార నిర్వహణపై అధికారులు శిక్షణనిస్తారు.

# ఉలిక్కిపడ్డ పెద్దకందుకూరు

యాదగిరిగుట్ట : పరిశ్రమ కార్మికులే కాదు.. పరిశ్రమకు అయిదు కిలోమీటర్ల మేర ఉన్న పల్లెలు శనివారం ఉలిక్కిపడ్డాయి. మూడు సార్లు భారీ శబ్దాలు వెలువడటం, అది భారత వాయుసేన (ఎయిర్ ఫోర్స్) కు పేలుడు ఉత్పత్తులను సరఫరా చేసే మండలంలోని పెద్దకందుకూరులోని ప్రసిద్ధ ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమ కావడం అందుకు కారణం. భారీ పేలుడు ముడి సరకులు, ఉత్పత్తులు నిల్వ ఉండే ఆ ప్రాంతం చాలా సున్నితత్వం. ఏ మాత్రం ఏమరుపాటు వహించినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఈ ప్రాంతంలో ఎందరికో ఉద్యోగ, ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమలో జరిగే విస్ఫోటన ఉగ్రరూపం చవిచూస్తూ కార్మికులు జాగ్రత్తలు వహిస్తూనే ఉంటారు. కానీ ఏం జరిగిందో ఏమో.. పరిశ్రమలోని పీఆర్‌డీసీ విభాగం వద్ద పేలుడు జరిగింది. ఈ ధాటికి మార్క కనకయ్య (50) అనే కార్మికుడు మృతి చెందగా, మొగలిపాక ప్రకాశ్ అనే కార్మికుడు తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. సాదువెల్లి నర్సింహులు, జి.వేణుగోపాల్‌లకు స్వల్పంగా గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. 1989లో ప్రారంభమైన ఈ పరిశ్రమ భారత వాయుసేన (ఎయిర్ ఫోర్స్), రక్షణ దళాలకు పేలుడు పదార్థాలను సరఫరా చేస్తోంది. పరిశ్రమలో 396 మంది కార్మికులు, 80 మంది అధికారులు, మిగతా కాంట్రాక్ట్ సిబ్బందితో కలిపి మొత్తం 600 మంది పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలో పీఆర్‌డీసీ విభాగం ఉంది. దీంట్లో 12 నుంచి 16 మంది పనిచేస్తుంటారు.




పేలుడు పదార్థాల తయారీకి వినియోగించే ముడి పదార్థాలైన మెగ్నీషియమ్, టెప్లాన్, వైబ్రాయిటర్‌లను మిశ్రమంగా చేసి కంప్రెస్‌తో ముద్దగా (ఐఆర్ ఫ్లేర్స్) మల్చడం దీంట్లో ప్రక్రియ. గతంలో ఇది మాన్యువల్‌గా ఉండగా, ప్రమాదాలు జరిగితే ప్రాణనష్టం జరగకుండా యంత్రాలతో ఆటోమెటిక్‌గా రూపొందించారు. ముడి సరకు ముద్దగా మారి, ఆరిపోయేంత వరకు గది తలుపు తెరవరు. ఆరిన బిల్లలను మాత్రం మాన్యువల్‌గా ఒక చోట చేర్చాల్సిన పనులను కార్మికులు చేస్తుంటారు. రెండు షిఫ్టులుగా నడిచే ఈ పరిశ్రమలో పీఆర్‌డీసీ విభాగంలో మాత్రం పేలుడు నిల్వల నేపథ్యంలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే నడుస్తోంది. పేలుడు, ప్రాణనష్టం జరగకుండా ఎంతో కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ ఉన్నప్పటికీ శనివారం జరిగిన పేలుడు అంతచిక్కకుండా ఉందని పరిశ్రమ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేస్తూ, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం 6 గంటలకు వెళ్లే కార్మికులు 10 గంటలకు భోజన విరామం తీసుకుంటారు. పేలుడు సంభవించిన 9:45 గంటల సమయంలో ఆ సెక్షన్‌తో పాటు మిగతా సెక్షన్‌లోని చాలా మంది కార్మికులు ఆ ప్రాంతం నుంచి భోజనానికి సిద్ధమవుతూ క్యాంటిన్ వైపుగా వెళ్లారు. ఆ సమయంలో వారు అక్కడ ఉండకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. 2019 సెప్టెంబరు 29న ఇదే చోట పేలుడు ప్రమాదం జరిగి పెద్దకందుకూరు గ్రామానికి చెందిన గుర్రం జైపాల్ అనే కార్మికుడు చనిపోయాడు. అప్పుడు అక్కడ మ్యాన్యువల్ విధానం ఉండటంతో అలా జరిగిందని ఆటోమెటిక్ విధానం తీసుకువచ్చారు. 2012లో మరో విభాగంలో జరిగిన ప్రమాదంలో ఆలేరుకు చెందిన ఎల్లయ్య, వంగపల్లికి చెందిన మోహినుద్దిన్ మృతి చెందారు. ఆ సమయంలో పేలుడుతో స్లాబ్ కూలడం వల్ల ఎక్కువ ప్రమాదం జరుగుతుందని తెలిసి స్లాబ్‌లకు బదులు రేకుల విధానం తీసుకువచ్చారు. రేకులు లేచిపోవడం వల్లే సుదూర ప్రాంతానికి శబ్ధం వినిపించిందని పరిశ్రమ అధికారులు తెలిపారు.

# మూడేళ్లయినా ముందుకు సాగదే!

భువనగిరి : మూస ధోరణి సాగులోకి పోకుండా ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని ప్రభు త్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆయిల్‌పాం సాగుపై ప్రత్యేక రాయితీనిస్తూ ప్రోత్సహిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సేద్యానికి రైతులు ఆసక్తి చూపడం లేదన్నది వాస్తవం. జిల్లా ఉద్యానశాఖ లక్ష్యాన్ని నిర్దేశించి సాగు కోసం చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఈ విషయమై రైతులకు పలు దఫాలుగా అవగాహన కల్పిస్తుండటంతో కొంతమేర రైతుల నుంచి సానుకూల ధోరణి కనిపిస్తోంది. ముఖ్యంగా ఆయిల్‌పాం సాగులో అధిక లాభాలున్నాయని అధికారులు రైతులకు వివరిస్తున్నారు.

**అంతర పంటలకూ లాభసాటి..**

ప్రత్యేకంగా ప్రతి జిల్లాకు ఒక నర్సరీ చొప్పున మోత్కూరు మండలం పాలడుగులో ఆయిల్‌పాం నర్సరీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేఎన్ బయోసైన్స్ సంస్థ ఈ మొక్కలను రైతులకు నేరుగా సరఫరా చేస్తోంది. ఈ నర్సరీలో సుమారు రెండున్నర లక్షల ఆయిల్‌పాం మొక్కలు అందుబాటులో ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఆసక్తి గల రైతు తన సాగుభూమిలో ఒక ఎకరానికి 57 మొక్కలు అవసరం ఉంటాయని అంచనా. ఒక్కొక్క మొక్కను 9 మీటర్ల వెడల్పుతో నాటుతారు. పెద్దగా అయ్యేంత వరకు నాటిన ఆయిల్‌పాం మొక్కల మధ్య అంతర పంటలుగా పూలు, పండ్లు, కూరగాయలు తదితరాలు కూడా సాగు చేసుకునే అవకాశం ఉంది. రాజపేట మండలం చల్లూరు లో రాజిరెడ్డికి చెందిన ఆయిల్‌పాం సాగులో అంతరపంటగా గత రెండేళ్లుగా గుమ్మడి సాగును, బొమ్మలరామారం మండలంలో పసుపు రంగులోని కర్బూజ సాగును చేపడుతూ ఉపాధి పొందుతున్నారు.

**రాయితీపై పరికరాలు**

ఆయిల్‌పాం సాగులో భాగంగా ప్రభుత్వం రైతులకు బిందు సేద్యం పరికరాలు, మొక్కలపై రాయితీ ఇస్తోంది. మొక్కలకు నీరందించేందుకు బిందు సేద్యం యూనిట్ విలువ రూ.53,465 ఉండగా, ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీ ఇస్తుంది. బీసీ, జనరల్ రైతులకు 90 శాతం రాయితీ ఇస్తుండగా, యూనిట్ విలువలో 10 శాతం సొమ్ము చెల్లిస్తే సరిపోతుంది. ఐదెకరాలు దాటితే మాత్రం 60 శాతం రాయితీ వర్తిస్తుంది. మొక్కలను సాగు చేసేందుకు ఏడాదికి దశలవారీగా రూ.4,200 చెల్లిస్తుంది. ఈ సొమ్మును నాలుగేళ్లపాటు ఉద్యానవన శాఖ అధికారులు అందించనున్నారు.

**మూడేళ్లలో సాగు ఇలా..**

శాఖ పరంగా లక్ష్యం : 12,500 ఎకరాలు
సాగు చేసింది : 4,292
రైతుల సంఖ్య : 971

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం ప్రవీణ్‌కుమార్, ఆయిల్‌ఫెడ్ జిల్లా సమన్వయకర్త, యాదాద్రి భువనగిరి ఆయిల్‌పాం సాగు చేసుకునేలా ఉద్యానవనశాఖ సహకారంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ విషయమై గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి పంటవల్ల కలిగే లాభాలు, దిగుబడి, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీల గురించి వివరిస్తున్నాం. ఇప్పుడిప్పుడే ఆయిల్‌పాం సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేస్తామనే నమ్మకం ఉంది.



## మంత్రులకు ర్యాంకులు.. ఎవరినీ తక్కువ చేయడానికి కాదు..

అమరావతి: ప్రజలు చరిత్రాత్మక తీర్పుతో గెలిపించారని.. వారి ఆశలు, ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు తొలిరోజు నుంచే ప్రయత్నిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు శాయశక్తులా కష్టపడుతున్నామని చెప్పారు. టీమ్ వర్క్‌గా పనిచేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమనే విషయాన్ని తాను విశ్వసిస్తానన్నారు. మంత్రులకు ర్యాంకుల కేటాయింపు ఎవరినీ తక్కువ చేయడానికి కాదని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్లు వంటి పథకాలతో సంక్షేమం అమలు చేస్తూనే.. మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల సాధనతో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాం. ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని సుపరిపాలనతో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం. ఈ లక్ష్యాలను వేగంగా చేరుకోవాలంటే ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడాలి. టీమ్ వర్క్‌గా పని చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలమని నేను విశ్వసిస్తాను. అసాధారణ, వేగవంతమైన పనితీరు చూపితే తప్ప.. విధ్వంస రాష్ట్రంలో పునర్నిర్మాణ ఫలితాలను ప్రజలకు చూపలేం. అందుకే ఎప్పటికప్పుడు ప్రతి ఒక్కరూ టీం స్పిరిట్‌తో పనితీరుపై సమీక్షించుకుని పనిచేయాలన్నదే మా ఆలోచన. అందులో భాగంగానే ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంకులు ఇచ్చాం. దస్త్రాల పరిష్కారంలో గురువారం విడుదల చేసిన ర్యాంకులు ఎవరినీ ఎక్కువ చేయడానికి.. ఎవరినీ తక్కువ చేయడానికి కాదు. ఎవరు ఏ స్థానంలో ఉన్నారనేది చెప్పడం ద్వారా ఒకరితో మరొకరు పోటీ పడి పనిచేయడానికి, పాలనలో వేగం పెంచేందుకు చేసిన ప్రయత్నమే ఇది. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో నేను కూడా నా స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉంది. 'పీపుల్ ఫస్ట్' విధానంతో నేను, నా క్యాబినెట్ సహచర మంత్రులమంతా పనిచేస్తున్నాం. లక్ష్యాల సాధనకు అడుగులు వేస్తున్నాం. గ్రామ స్థాయిలో చిరు ఉద్యోగి నుంచి సీఎం వరకు అంతా కష్టపడి సమష్టిగా పనిచేస్తేనే ప్రజల సమస్యలు, కష్టాలు తీర్చి.. సమస్యల సుడిగుండంలో ఉన్న రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టగలం. ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో శాఖల్లో అత్యున్నత ప్రతిభ చూపిస్తారని ఆశిస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.




# మాజీమంత్రి విడదల రజిని మెడకు మరో ఉచ్చు..!

## ఇలాంటి కేసు వస్తుందని అస్సలు ఊహించలేదట..!

ఆ మాజీ మంత్రిని వివాదాలు విడిచి పెట్టడం లేదు. ఒక ఇష్యూ అయిపోగానే మరో కాంట్రవర్సీలో కార్నర్ అయిపోతున్నారు. ఇప్పుడు మరో కేసు మేడమ్ గారికి ఇబ్బందికరంగా మారుతోంది. విడదల రజినికి న్యాయపరంగా చిక్కులు తప్పవా? టీడీపీ కార్యకర్తలను వేధించింది నిజమేనా? ఇంతకు విడుదల రజిని మీద అలిగేషన్స్ ఏంటి..? హైకోర్టు ఇచ్చిన ఆదేశాలేంటి.? ఆమెకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లింది ఎవరు.? పవర్‌లో ఉన్నప్పుడు ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది. అధికారంలో ఉన్నప్పుడు రెచ్చిపోయి..అడ్డగోలుగా వ్యవహరిస్తే..పవర్ పోయాక పర్యవసానాలు ఫేస్ చేయాల్సి వస్తుంది. ఏపీలో చాలామంది వైసీపీ నేతలు ఇప్పుడు ఈ పరిస్థితులను ఫేస్ చేస్తున్నారు. అందులో మాజీమంత్రి విడదల రజిని ఒకరు. అధికారంలో ఉన్నప్పుడే సొంత పార్టీ నేతలకు టార్గెట్ అయిన ఆమె..ఇప్పుడు అపోజిషన్‌లోకి వచ్చాక కేసుల పాలవుతున్నారు. అలా ఆమెను ఒక్కో ఉచ్చు చుట్టుముడుతోంది. కర్షప్షన్స్ అలిగేషన్స్ అలా ఉండగానే..ఇప్పుడు కస్టోడియల్ టార్చర్ కేసు ఆమె మెడకు చుట్టుకునేలా కనిపిస్తోంది.

**కేసు నమోదు చేయాలని ఏపీ హైకోర్టు ఆదేశం..** వైసీపీ హయాంలో చివరి రెండేళ్లు వైద్యారోగ్యశాఖ మంత్రిగా హవా చూపించిన విడదల రజిని.. పార్టీ ఓడినప్పటి నుంచి అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు. ఆమె మంత్రిగా పనిచేసిన కాలంలో చేసిన అరాచకాలపై ప్రత్యర్థులు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. అవన్నీ ఒక ఎత్తు అయితే మరో కేసు ఆమెకు ఇబ్బందికరంగా మారేలా ఉంది. వైసీపీ హయాంలో తనను చిత్రహింసలకు గురి చేశారని ఓ టీడీపీ నేత కోర్టుకు వెళ్లడంతో మాజీ మంత్రి విడదల రజినితో పాటు ఆమె ఇద్దరు పీఏలు, అప్పటి సీఐ సూర్యనారాయణపై కేసు నమోదు చేయాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో విడదల రజిని మరోసారి చిక్కుల్లో పడే పరిస్థితి వచ్చింది. టీడీపీ నేత పిల్లి కోటి తన మీద అప్పట్లో జరిగిన చిత్ర హింస మీద హైకోర్టును ఆశ్రయించడంతో.. కేసు పెట్టాలని న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. తానేమీ తప్పు చేయకపోయినా..అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు టార్చర్ పెట్టారని పిల్లి కోటి ఆరోపించారు.

**టీడీపీ కోసం పని చేస్తే చంపేస్తామని బెదిరింపులు..!** 2019లో చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌లో తనను కొట్టారని.. చిత్రహింసలు పెడుతున్న దృశ్యాలను లైవ్‌లో చూస్తూ రజిని పైశాచిక ఆనందం పొందారని ఆరోపించాడు. టీడీపీ కోసం పని చేస్తే చంపేస్తామని బెదిరించారని కూడా చెప్తున్నాడు కోటి. ఆయన పిటిషన్‌ను విచారించిన కోర్టు..మాజీ మంత్రితో సహా పలువురిపై చర్యలకు ఆదేశించింది. కోర్టు ఆర్డర్స్‌ను ఇంప్లిమెంట్ చేయాలని పిల్లి కోటి ఎస్పీని కూడా కలిశాడు. విడదల రజిని మీద ఇలాంటి కేసు వస్తుందని ఆమె అనుచరులు కూడా ఊహించలేదని అంటున్నారు. ఒక సాధారణ టీడీపీ నాయకుడు కోర్టుకు వెళ్లి మాజీ మంత్రి మీద కేసు ఫైల్ చేయించేలా ఆదేశాలు తేవడంతో ఆమె వర్గీయులలో కలవరం మొదలైందట. ఇప్పటికే విడదల రజినిపై పలు ఆరోపణలు ఉన్నాయి. చిలకలూరిపేటలో ఓ క్వారీ యజమానిని బెదిరించి రజిని రెండు కోట్లు తీసుకున్నారని విజిలెన్స్ రిపోర్ట్ తేల్చింది. ఈ వసూళ్లే కాదు..చిలకలూరిపేటలో జగనన్న కాలనీలకు సేకరించిన భూములకు చెందిన రైతుల నుంచి కోటి 16 లక్షల రూపాయల కమీషన్ తీసుకున్నారని విడదల రజినిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ బాగోతం బయటపడగానే సర్దుకున్న మాజీ మంత్రి రైతులకు ఆ మొత్తం తిరిగిచ్చేశారట. దీంతో పోలీస్ కేసు నుంచి తప్పించుకున్నారు రజిని. ఎన్నికల ముందు చిలకలూరిపేట టికెట్ ఇప్పిస్తానని అప్పటి వైసీపీ ఇన్‌చార్జి మల్లెల రాజేశ్ నాయుడు నుంచి దాదాపు 6 కోట్లు తీసుకున్నారని ఆయన కొన్నాళ్లు రోడ్డెక్కారు. ఇలా ఆమెకు వరుస కేసులు..అలిగేషన్స్ తలనొప్పిగా మారాయి. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలతో విడదలపై కేసు నమోదు విషయంలో పోలీసుల ఎలా వ్యవహరిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



## జగన్‌కు విజయసాయి కౌంటర్

అమరావతి : వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ ఎంపీ విజయ సాయి రెడ్డి స్పందించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. "నేను వ్యక్తిగత జీవితంలోనూ విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్ ఉన్న వాడిని. అందుకే ఎవరికీ, ఎలాంటి ప్రలోభాలకీ లొంగలేదు. భయం అనేది నాలో ఏ అణువు లోనూ లేదు. అందుకే రాజ్యసభ పదవిని, పార్టీ పదవుల్ని, రాజకీయాలను వదులుకున్నా" అని పేర్కొన్నారు.

**జగన్ ఏమన్నారంటే?..** "మా రాజ్యసభ సభ్యుల్లో సాయిరెడ్డితో కలిపితే పోయింది నలుగురు. రాజకీయాల్లో ఉన్నపుడు విశ్వసనీయతకు అర్థం తెలిసి ఉండాలి. మనంతట మనమే ప్రలోభాలకు లొంగో, భయపడో రాజీపడి అటువైపు పోతే మన వ్యక్తిత్వం, విలువ, విశ్వసనీయత ఏంటి? సాయిరెడ్డికైనా, పోయిన ముగ్గురు ఎంపీలకైనా ఇంకా ఒకరో ఇద్దరో పోతే వాళ్లకైనా అంతే, వైకాపా ఈ రోజు ఉందీ అంటే వారి వల్ల కాదు. దేవుడి దయ, ప్రజల ఆశీస్సులతోనే ఉంది" అని జగన్ అన్నారు.

## ఫిబ్రవరి 24 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

అమరావతి: ఈనెల 24 నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నారు. 24న ఉదయం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. 28న 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశముంది. 15 పనిదినాలు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. మొదటి రోజు బీఏసీ తర్వాత సభ ఎన్ని రోజులు జరపాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. అసెంబ్లీ సమావేశాలకు మంత్రులు పూర్తి స్థాయి సబ్జెక్టుతో హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి.






## సీఎం చంద్రబాబుతో నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ భేటీ

అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బేరి నేతృత్వంలోని బృందం భేటీ అయింది. సచివాలయంలో ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, 2047- విజన్ డాక్యుమెంట్‌పై చర్చించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపైనా ఈ భేటీలో చర్చ జరిగినట్లు తెలిసింది.





## వైఎస్సార్‌సీపీలోకి మాజీ మంత్రి శైలజానాథ్

తాడేపల్లి: వైఎస్సార్‌సీపీలోకి మాజీ మంత్రి సాకే శైలజానాథ్ చేరారు. ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలోకి చేరారు. కండవా కప్పి పార్టీలోకి వైఎస్ జగన్ ఆహ్వానించారు. శైలజానాథ్‌తో పాటు ఏఐసీసీ మెంబర్, అనంతపురం డీసీసీ మాజీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు.

**వైఎస్ జగన్ రాజకీయ విధానాలు నచ్చటం వల్లే..** ఈ సందర్భంగా శైలజానాథ్ మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ జగన్ నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధమన్నారు. ప్రజల తరుపున వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. వైఎస్ జగన్ రాజకీయ విధానాలు నచ్చటం వల్లే వైఎస్సార్‌సీపీలోకి చేరానని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను అవలంబిస్తోందని.. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చటం లేదని శైలజానాథ్ అన్నారు. "ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుంది. రాయలసీమలో ప్రజల కష్టాలు తీర్చేందుకు నా వంతు పనిచేస్తా.. రాజకీయాలు ప్రజా ప్రయోజనాల కోసం చేయాలే కానీ ఆర్థిక ప్రయోజనాల కోసం కాదు. కాంగ్రెస్ నుంచి మరికొందరు నేతలు వచ్చే అవకాశం ఉంది. ఎవరెవరు వస్తారనేది ఇప్పుడే చెప్పలేం. జగన్ ఏ బాధ్యత అప్పగించినా నా శక్తి మేరకు పనిచేస్తా" అని శైలజానాథ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత వెంకట్రామిరెడ్డి, వేంపల్లి సతీష్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.విశ్వేశ్వర రెడ్డి, తలారి రంగయ్య, మేరుగ నాగార్జున, పలువురు నాయకులు పాల్గొన్నారు. కాగా, అనంతపురం జిల్లాకు చెందిన శైలజానాథ్ శింగనమల నియోజకవర్గం నుంచి 2004, 2009లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలుపొందారు. ఉమ్మడి ఏపీలో మంత్రిగా పనిచేశారు. 2022లో ఏపీసీసీ అధ్యక్షుడిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు.



## జగన్ ఆ రూ.20 వేల కోట్లు.. మీ ప్యాలెస్ కంచె కోసం ఖర్చు చేశారా?

అమరావతి: పెద్దవాళ్లంటే వైకాపా అధ్యక్షుడు జగన్‌కు ఏమాత్రం గౌరవం లేదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విమర్శించారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. "జగన్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకైనా అర్థమవుతోందా? ఆయనకు మతి భ్రమించినట్లుగా ఉంది. రూ.20 వేల కోట్లు అప్పు చేసిన పెద్ద మనిషి ఆ డబ్బులతో ఏం చేశారో చెప్పాలి. ఏప్రిల్, మేలో రూ.20 వేల కోట్లు అప్పు చేశారు.. వెంటనే ఎన్నికలు వచ్చాయి. ఆ డబ్బుతో ఏం చేశారో చెప్పాలి.

తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ కంచె వేసుకునేందుకు ఖర్చు పెట్టారా? వైకాపా నేతలు.. నిధులన్నీ దారి మళ్లించి వాడేసుకున్న తిమింగలాలు. ఆఖరికి సర్పంచుల నిధులు కూడా దారి మళ్లించిన ఘనత జగన్‌ది" అని సంధ్యారాణి మండిపడ్డారు.

## తితిదే బోర్డును రద్దు చేయాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు



దిల్లీ: తితిదే బోర్డును రద్దు చేయాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. తితిదే బోర్డు, తిరుపతి తొక్కిసలాట ఘటనపై రామచంద్ర యాదవ్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానం పర్యవేక్షణలో విచారణ జరగాలని, తొక్కిసలాట ఘటనలో పరిహారం పెంచాలని అందులో పేర్కొన్నారు. ఈ క్రమంలో సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. పిటిషన్‌లో పేర్కొన్న అంశాలపై ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయడంలేదని పేర్కొంది. పిటిషన్‌పై విచారణకు నిరాకరించింది.

## మరో వివాదంలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

విజయవాడ: తిరువూరు తెదేపా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరో వివాదంలో చిక్కుకున్నారు. ఎమ్మెల్యే వేధింపులు తాళలేక తెలుగుదేశం కార్యకర్త డేవిడ్ గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పార్టీ కోసం కష్టపడిన తనను అక్రమ కేసులతో వేధిస్తున్నారని.. ఆత్మహత్యాయత్నానికి ముందు డేవిడ్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ప్రస్తుతం అతను విజయవాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. డేవిడ్ సెల్ఫీ వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీడియో బయటకు రాకుండా కొలికపూడి నిన్న అందరినీ బెదిరించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ఏపీలో ప్రతి పౌరుడికి డిజిలాకర్.. అన్ని పత్రాలు వాట్సప్‌లోనే



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఇకపై అన్ని ధ్రువపత్రాలు మొబైల్ ఫోన్‌లోనే జారీ చేయనున్నట్లు ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. ఇందుకోసం ప్రతి పౌరుడికి డిజిలాకర్ సదుపాయం కల్పిస్తామని.. అన్ని పత్రాలను వాట్సప్‌లోనే డౌన్‌లోడ్ చేసుకొనే సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. శుక్రవారం వాట్సప్ గవర్నెన్స్‌పై ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ సమీక్ష నిర్వహించారు.

"డేటా అనుసంధానంతో పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. డేటా అనుసంధాన ప్రక్రియను వెంటనే పూర్తి చేస్తున్నాం. తద్వారా వాట్సప్ ద్వారానే ప్రభుత్వానికి అర్జీలు, ఫిర్యాదులు చేసే అవకాశం ఉంటుంది. చదువు రాని వాళ్లు వాయిస్ మెసేజ్ ద్వారా అర్జీలు, ఫిర్యాదులు చేసేందుకు అవకాశం కల్పిస్తాం. ప్రతి శాఖలో చీఫ్ డేటా టెక్నికల్ అధికారిని నియమించేలా చర్యలు తీసుకుంటాం. నిరంతరాయ సేవల కోసం ఆర్టీజీఎస్ ద్వారా డేటా లేక్ ఏర్పాటు చేస్తాం" అని భాస్కర్ తెలిపారు.




## అందాల ప్రగ్యా క్లోజప్ షో అదుర్స్

ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్దకాలం అయినా ప్రగ్యా జైస్వాల్ సాలిడ్ స్టార్‌డంను దక్కించుకోవడంలో మాత్రం సఫలం కాలేదు. కొన్ని సినిమాలు సక్సెస్ అయినా ఈమెకి మాత్రం ఆ క్రెడిట్ దక్కలేదు. అఖండ, డాకు మహారాజ్ సినిమాల్లో నటించి సక్సెస్ దక్కించుకున్నా ప్రగ్యా జైస్వాల్ వెంట వెంటనే ఆఫర్లు మాత్రం దక్కించుకోలేక పోతుంది. ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు ఆఫర్ల కోసం ఈ అమ్మడు ఎదురు చూడాల్సి వస్తుంది. ఈ పదేళ్ల కాలంలో ఈ అమ్మడు చేసిన సినిమాలు చాలానే ఉన్నాయి, కొన్ని హిట్ అయితే ఎక్కువ శాతం నిరాశ పరిచాయి. అయినా ఇండస్ట్రీలో కొనసాగడానికి కారణం అందం అనడంలో సందేహం లేదు. ప్రగ్యా జైస్వాల్ తన అందమైన ఫోటో షూట్‌ను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా మూడు మిలియన్ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ప్రగ్యా జైస్వాల్ రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను పంచుకుంటూ ఉంటుంది. ఇంతటి అందమైన ప్రగ్యా జైస్వాల్‌కి ఎందుకు వరుసగా ఆఫర్లు రావడం లేదు, ఎందుకు ఇప్పటి వరకు సరైన బ్రేక్ దక్కలేదు అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తూ ఉంటారు. కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటి వరకు ప్రగ్యా తన అందంతో ఆఫర్లు దక్కించుకోవాల్సి వస్తుంది. నటన పరంగా కొన్ని సినిమాల్లో



అవకాశం దక్కడంతో మెప్పించింది. అయినా నటిగా ఛాన్స్ దక్కడం లేదు. తాజాగా మరోసారి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తన అందమైన ఫోటో షూట్‌ను షేర్ చేసింది. ఈసారి అంతకు మించి అంటూ తన అందాల ఫోటోలను షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతోంది. సింపుల్ ఔట్ ఫిట్‌లో మెడలో ఆభరణాలు ఏమీ లేకుండా క్లీవేజ్ షో చేస్తూ చూపు తిప్పుకోనివ్వకుండా అందంగా ఉన్న ప్రగ్యా జైస్వాల్ మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. ఇలాంటి ఫోటోలను షేర్ చేయడంతో ఫిల్మ్ మేకర్స్ పిలిచి ఆఫర్లు ఇస్తున్నారు. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో ఆ సినిమాలు ఆకట్టుకోవడం లేదు, ఒక వేళ హిట్ అయినా ఈమెకు పెద్దగా గుర్తింపు రావడం లేదు. ముందు ముందు అయినా ప్రగ్యా జైస్వాల్‌కి హీరోయిన్‌గా మంచి ఆఫర్లు వస్తాయా అంటూ ఆమె ఫాలోవర్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రగ్యా జైస్వాల్ సినిమాల విషయానికి వస్తే ఈ ఏడాదిలో డాకు మహారాజ్‌తో మొదలు పెట్టింది. ఇదే ఏడాదిలో మరోసారి బాలకృష్ణతో అఖండ 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. అఖండ సినిమాలో ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటించిన కారణంగా సీక్వెల్‌లోనూ ఆమె నటించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న సినిమాలోనూ ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ రెండు సినిమాలు కాకుండా హిందీ, తమిళ్‌లోనూ చర్చలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ప్రగ్యాకి మరో పెద్ద బిగ్ హిట్ పడుతుందా అనే ఆసక్తి అందరిలోనూ కనిపిస్తోంది.

## సంయుక్త డివోషనల్ మోడ్..!

మలయాళంలో సినిమాలు చేస్తూ తన ప్రతిభ చాటుతూ వస్తున్న సంయుక్త తెలుగులో భీమ్లా నాయక్ సినిమాతో తొలి ఛాన్స్ అందుకుంది. ఆ సినిమా రిలీజ్ అయ్యాక అమ్మడికి వరుస సినిమా ఛాన్స్ లు వచ్చాయి. విరూపాక్ష, సార్ సినిమాలు సక్సెస్ అవ్వడంతో అమ్మడు ఇక దూసుకెళ్తుందని అనుకోగా డెవిల్ ఫ్లాప్ తో డీలా పడింది. నెక్ట్స్ సినిమాల అవకాశాలు కూడా మందగించాయి. ఐతే ఈమధ్యనే అఖండ 2లో అమ్మడు ఛాన్స్ దక్కించుకుంది. బాలకృష్ణతో సినిమా అంటే ఆ రేంజ్ వేరేలా ఉంటుంది. సో అఖండ 2 సంయుక్తకి కచ్చితంగా కలిసి వచ్చేలా ఉందని చెప్పొచ్చు. ఈ సినిమాతో పాటు నిఖిల్ తో స్వయంభు సినిమా కూడా చేస్తుంది అమ్మడు. స్వయంభు కోసం హార్స్ రైడింగ్ కూడా నేర్చుకుంటుంది సంయుక్త. ఇదిలా ఉంటే ప్రస్తుతం ప్రయాగ్ లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లి అక్కడ త్రివేణి సంగమంలో పుణ్యస్నానం చేసింది సంయుక్త. మహా



కుంభమేళాకి వెళ్లిన సంయుక్త అక్కడ ఫోటోని షేర్ చేస్తూ గంగానదిలో పవిత్ర స్నానం ఎప్పటికీ ఉత్సాహాన్ని ఇస్తుంది.. జీవితం యొక్క విశాలత కళ్లారా చూసినప్పుడే దాని అర్థాన్ని మరింత తెలుసుకోగలం అని రాసుకొచ్చింది. తనకు ఇచ్చిన పాత్రలో ది బెస్ట్ ఇస్తూ సంయుక్త సత్తా చాటుతూ వస్తుంది. టాలీవుడ్ ఎంట్రీ తర్వాత తన పంథా మార్చేయాలని ఫిక్స్ అయ్యింది సంయుక్త. ఇక్కడ గ్లామర్ పరంగా కూడా ఛాన్స్ లు కొట్టేయాలని చూస్తుంది అమ్మడు. అందుకే సినిమాల్లో అవకాశం ఉన్నా లేకపోయినా ఫోటో షూట్స్ రూపంలో స్కిన్ షో చేస్తుంది. యువ హీరోలతో పాటు సీనియర్ స్టార్స్ కి అమ్మడు హీరోయిన్ గా చేస్తూ వస్తుంది. తెలుగుతో పాటు సంయుక్తకి తమిళ ఆఫర్లు వస్తున్నట్టు తెలుస్తుంది. ఐతే సంయుక్త మాత్రం తెలుగు సినిమాలు చేయడానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. ఐతే అమ్మడు చేసిన సినిమాలు కమర్షియల్ హిట్లు కొడుతున్నా కూడా పర్సనల్ గా తన క్రేజ్ పెంచుకోవడంలో వెనకపడింది సంయుక్త. అందుకే ఇక టాప్ గేర్ మార్చి సినిమాలు చేయాలని ఫిక్స్ అయ్యింది. సంయుక్త ప్రస్తుతం చేస్తున్న రెండు సినిమాలు కూడా ఆమెకు మంచి పేరు తెచ్చేలా ఉన్నాయి.

## తమిళ హీరోతో మైత్రి జాక్ పాట్ ప్లాన్!



ఈ రోజు ప్రేక్షకుల ముందుకు వచ్చిన అజిత్ లేటెస్ట్ మూవీ పట్టుదల (విడాముయార్చి) మొదట్లో అంతగా హైప్ లేకుండా కనిపించినా, విడుదల తర్వాత మంచి స్పందన తెచ్చుకుంటోంది. టీజర్, ట్రైలర్ ఆశించినంతగా ఆకట్టుకోలేకపోయినా, తమిళనాట అజిత్ మాస్ క్రేజ్‌తో ఓపెనింగ్స్ అదిరిపోయాయి. అయితే, తెలుగు మార్కెట్‌లో మాత్రం ఈ సినిమాపై చాలా తక్కువ అంచనాలు ఉండటంతో, ఇక్కడ బిజినెస్ పరంగా పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది. హాలీవుడ్ స్టైల్ కథా నేపథ్యంలో తీశారు కాబట్టి, మాస్ ఆడియెన్స్‌కు అంతగా కనెక్ట్ కావడం కష్టమేనని ట్రేడ్ వర్గాలు భావించాయి. అయితే, తమిళనాట మాత్రం అజిత్ తన స్టార్ పవర్ ఏమిటో మరోసారి నిరూపిస్తున్నాడు. అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఈ సినిమా తెగింపు, గోట్ స్థాయిలో ఓపెనింగ్స్ నమోదు చేస్తూ, భారీ రన్‌ను కొనసాగిస్తోంది. యూఎస్ ప్రీమియర్ల టాక్ మిశ్రమంగా ఉన్నప్పటికీ, అజిత్ ఫ్యాన్ ఫాలోయింగ్ వల్ల తమిళనాట భారీ వసూళ్లు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక, ఈ సినిమా విజయంతో మరో అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రం నిర్మాత మైత్రి మూవీ మేకర్స్‌కి ఇది గోల్డ్ మైన్‌లా మారే అవకాశముంది. ఎందుకంటే, అజిత్ తదుపరి చిత్రం గుడ్ బ్యాడ్ అగ్లీ కూడా వీరే నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కోలీవుడ్‌లో ఈ సినిమాపై భారీ బజ్ నడుస్తోంది. ముఖ్యంగా, ఈ చిత్రంలో అజిత్ ఊర మాస్ లుక్‌తో కనిపించనున్నాడని తెలుస్తోంది. గతంలో గ్యాంబ్లర్ సినిమా తర్వాత అజిత్ మళ్లీ ఆ రేంజ్ అవతారంలో కనిపించబోతున్నాడు. దీంతో, గుడ్ బ్యాడ్ అగ్లీ విడుదలకు ముందే బిజినెస్ రికార్డుల మీద రికార్డులు క్రియేట్ చేసేలా ఉంది. ఈ సినిమాకి సంబంధించిన ప్రమోషన్లు ఇంకా ప్రారంభం కాలేదు. కానీ, ఏప్రిల్ 10న సినిమా విడుదల ఖరారైపోయింది. మైత్రి మూవీ మేకర్స్ వచ్చే నెల నుండి ప్రమోషన్ స్పీడ్ పెంచబోతున్నారట. మ్యూజిక్ పరంగా దేవిశ్రీ ప్రసాద్ పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను జివి ప్రకాష్ అందించబోతుండటం సినిమాకు మరింత ఆకర్షణను తెచ్చే అంశంగా మారింది. ఇప్పటి వరకు కథకు సంబంధించిన ఎలాంటి అఫీషియల్ అప్‌డేట్ బయటకు రాలేదు. కానీ, అజిత్ ఇందులో డ్యూయల్ రోల్ చేస్తున్నాడనే టాక్ బలంగా వినిపిస్తోంది. ఆయన ఒకటే సినిమాలో మంచి వాడిగా, చెడ్డ వాడిగా ద్విపాత్రాభినయం చేయడం కొంతకాలంగా జరగలేదు. దీంతో, ఇది ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. కోలీవుడ్ ట్రేడ్ వర్గాల అంచనా ప్రకారం, ఈ చిత్రం కనీసం 100 కోట్ల ఓపెనింగ్ సాధించే ఛాన్స్ ఉందని చెబుతున్నారు. ఈ సారి తమిళ మార్కెట్ మాత్రమే కాకుండా, తెలుగులో కూడా అజిత్ బిజినెస్ పెంచేలా మైత్రి మూవీ మేకర్స్ భారీ ప్రమోషన్లు ప్లాన్ చేస్తున్నారని సమాచారం. అజిత్ ఫ్యాన్స్ మాత్రం ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు వస్తున్న అప్‌డేట్స్ చూస్తుంటే, గుడ్ బ్యాడ్ అగ్లీ అజిత్ కెరీర్‌లో మరో మాస్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచే అవకాశముంది. మరి మైత్రి వారు ఈ క్రేజ్ ను ఏ స్థాయిలో క్యాష్ చేసుకుంటారో చూడాలి.

## 6 దేశాలు.. 25 నగరాలు... సూపర్ స్టార్ మూవీ అరుదైన రికార్డ్



మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ సూపర్ హిట్ మూవీ 'లూసీఫర్' కి సీక్వెల్ రూపొందుతోంది. మొదటి పార్ట్‌కి దర్శకత్వం వహించిన పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ సీక్వెల్‌కి దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్ ముగించిన మేకర్స్ ప్రమోషన్స్ పనుల్లో బిజీ అయ్యారు. వచ్చే నెలలో విడుదల కాబోతున్న ఈ సినిమా గురించి మీడియా వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. సాధారణంగా మోహన్‌లాల్ సినిమా వస్తుందంటే మలయాళ సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంటుంది. అంచనాలు భారీగా ఉంటాయి. ఆ అంచనాలను తగ్గకుండా ఈ సినిమా ఉంటుంది అంటూ దర్శకుడు పృథ్వీ రాజ్ సుకుమారన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో రూపొందించినట్లు చెప్పుకొచ్చారు. తాజాగా సినిమా గురించి మరో ఆసక్తికర వార్త ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సినిమాను 6 దేశాల్లో చిత్రీకరించినట్లుగా మేకర్స్ చెబుతున్నారు. అంతే కాకుండా ప్రపంచంలోని ప్రముఖ నగరాల్లో ఈ సినిమా షూటింగ్ జరిగిందని చెబుతున్నారు. 25 ప్రముఖ నగరాల్లో ఈ సినిమా షూటింగ్‌ను జరిపిన కారణంగా అరుదైన ఘనత దక్కిందని మలయాళ సినీ ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. 6 దేశాల్లో, 25 నగరాల్లో సినిమా షూటింగ్ జరగడం అనేది మలయాళ సినిమా చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. ఈ సినిమా కథ రీత్యా అంత భారీ ఎత్తున షూట్ చేయాల్సి వచ్చిందని మేకర్స్ చెబుతున్నారు. లూసిఫర్ సినిమా మలయాళ సినిమా ఇండస్ట్రీలోనే కాకుండా ఇతర భాషల్లోనూ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. మోహన్‌లాల్ పోషించిన పాత్రను తెలుగులో చిరంజీవి పోషించి గాడ్ ఫాదర్‌గా రీమేక్ చేయడం జరిగింది. లూసీఫర్ మంచి విజయాన్ని సొంతం చేసుకుంటే గాడ్ ఫాదర్ మాత్రం ఆశించిన స్థాయి విజయాన్ని సొంతం చేసుకోలేదు. దాంతో లూసీఫర్ సీక్వెల్‌ను రీమేక్ చేసే ఆలోచన మెగాస్టార్ చిరంజీవి చేయక పోవచ్చు అని తెలుస్తోంది. మోహన్ లాల్‌కి ఎలాగూ తెలుగులో ఒక గుర్తింపు ఉంది. సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే కచ్చితంగా ప్రేక్షకులు సినిమాను చూసే అవకాశాలు ఉంటాయి. అందుకే తెలుగులోనూ డబ్ చేసి విడుదల చేస్తారని తెలుస్తోంది. భారీ అంచనాల నడుమ రూపొందిన లూసీఫర్ సినిమాను మార్చి 27న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. దాదాపు ఆరు వారాల సమయం విడుదలకు ఉంది. దాంతో మేకర్స్ పాన్ ఇండియా స్థాయిలో ప్రమోట్ చేయడం కోసం ప్లాన్ చేస్తున్నారు. లూసీఫర్ కి అన్ని భాషల్లోనూ ప్రేక్షకుల నుంచి మంచి స్పందన దక్కింది. చిరంజీవి గాడ్ ఫాదర్ కంటే ముందు మోహన్‌లాల్ లూసీఫర్ తెలుగు డబ్బింగ్ వర్షన్ అందుబాటులో ఉంది. ఆ సమయంలో చాలా మంది లూసీఫర్‌ను తెలుగులో చూసిన దాఖలాలు ఉన్నాయి. అందుకే లూసీఫర్ సీక్వెల్ ఎల్ 2 : ఎంపురాన్ కి మంచి స్పందన దక్కే అవకాశాలు ఉన్నాయి.

## జాన్వీకపూర్ కి మళ్లీ షాక్ ఇచ్చిన యూనిట్!

ఆ సినిమా విడుదల వాయిదాతో జాన్వీ కపూర్ ఇబ్బంది పడుతోందా? కొత్త ఏడాది ఆరంభంలోనే అమ్మడికి ఇక్కట్లు తప్పడం లేదా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. ప్రస్తుతం జాన్వీ కపూర్ లో బాలీవుడ్ లో 'పరమ్ సుందరి', 'సన్నీ సంస్కారీకి తులసీ కుమారీ'లో నటిస్తోంది. వీటితో పాటు తెలుగులో రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న 16వ చిత్రంలోనూ నటిస్తోంది. అయితే ఏప్రిల్ లో రిలీజ్ కావాల్సిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారీ' మరోసారి వాయిదా పడింది. అనుకున్న టైమ్ లో షూటింగ్ పూర్తి కాకపోవడంతో వాయిదా వేసారు. ఈ సినిమా ఇంకా 25 రోజులు షూటింగ్ పూర్తి చేయాల్సి ఉంది.



దీంతో ఈ సినిమా ఎప్పుడు షూటింగ్ పూర్తవుతుంది? ఎప్పుడు రిలీజ్ అవుతుంది? అన్న దానిపై మరోసారి నీలి నీడలు కమ్ముకున్నాయి. అయితే ఈ సినిమా ఇలా వాయిదా పడటం కారణంగా జాన్వీ కి ఇతర సినిమాలతో డేట్లు క్లాష్ అవుతున్నాయట. ముఖ్యంగా రామ్ చరణ్ తో నటిస్తోన్న సినిమా షూటింగ్ కి అంతరాయం ఏర్పడుతుందట. జాన్వీ కపూర్ 25 రోజుల్లో 15 రోజుల పాటు కంటున్యూగా షూటింగ్ కి హాజరవ్వాల్సి ఉందట. అయితే చరణ్ సినిమాకి కేటాయించిన డేట్లలోనే ఈ 15 రోజులు కూడా క్లాష్ కి వస్తున్నాయట. దీంతో జాన్వీ కపూర్ కి ఏం చేయాలో అర్దం కాని సందిగ్దంలో పడిందంటున్నారు. ఒకే సమయంలో ముంబై టూ హైదరాబాద్ తిరగడం సాధ్యం పడదు. రెండు సినిమాల షూటింగ్ ఒకే చోట అయితే ఇబ్బంది ఉండదు. – పరమ్ సుందరి–, 'సన్నీ సంస్కారీ కి తులసీ కుమారి' షూటింగ్ లను ఇప్పటివరకూ అలాగే బ్యాలెన్స్ చేసుకుంటూ వచ్చింది. కానీ రామ్ చరణ్ సినిమా షూటింగ్ హైదరాబాద్ లో జరుగుతుంది కాబట్టి వీలు పడదు. ఈ నేపథ్యంలో డేట్లు క్లాష్ అవ్వకుండా చరణ్ మేకర్స్ నో, హిందీ సినిమా వాళ్లనే సర్దుబాటు చేయమని అడగాల్సిన పరిస్థితి. డిలే కారణంగా వాయిదా వేసారు కాబట్టి ఈ విషయంలో బాలీవుడ్ మేకర్సే వెనక్కి తగ్గాల్సి ఉంటుంది. ఇప్పటికే చరణ్ సినిమాకి సంబంధించి జాన్వీ షెడ్యూల్ ఫిక్స్ అయింది.

## గాగ్రా చోళీలో యుక్తి మెరుపులు

2023లో నాగ శౌర్య హీరోగా వచ్చిన రంగబలి సినిమాతో టాలీవుడ్ కు ఎంట్రీ ఇచ్చిన హర్యానా భామ యుక్తి తరేజాకు ఆ సినిమా తర్వాత తెలుగులో మంచి ఆఫర్లొస్తాయనుకున్నారు. కానీ ఆ సినిమా ఫ్లాప్ అవడంతో అమ్మడికి నిరాశే మిగిలింది. రంగబలి తర్వాత యుక్తి తరేజాకి టాలీవుడ్ నుంచి ఎలాంటి ఆఫర్లు రాకపోవడంతో మలయాళంలో ఓ సినిమా చేసింది. యుక్తి మలయాళంలో చేసిన మార్కో రీసెంట్ గా రిలీజై మంచి హిట్ అందుకుంది. ఆ సినిమా హిట్ అవడంతో ఇప్పుడు అందరి దృష్టి యుక్తి పైనే ఉంది. మార్కో హిట్ అవడంతో యుక్తికి కిరణ్ అబ్బవరం తాజా సినిమా కె ర్యాంప్ లో అవకాశమిచ్చారు దర్శకనిర్మాతలు. రాజేష్ దండా నిర్మించనున్న



ఈ సినిమా పూజా కార్యక్రమాలతో మొదలైంది. కె ర్యాంప్ సినిమా పూజా కార్యక్రమానికి యుక్తి ఇలా గాగ్రా చోళీలో మెరిసింది. సీ బ్లూ కలర్ గాగ్రా ధరించి చేతికి మ్యాచింగ్ బ్రేస్‌లెట్, చెవులకు పెద్ద హ్యాంగింగ్స్ వేసుకుని, లూజ్ గా జడ వేసుకుని మరింత తన నడుము అందాలను చూపిస్తూ మునుపటి కంటే మరింత అందంగా కనిపించింది. ఈ గాగ్రాలో యుక్తిని చూసిన వాళ్లంతా ఆమె ఫోటోలను తెగ షేర్ చేస్తున్నారు. 2019లో మోడలింగ్ తో కెరీర్ ను మొదటుపెట్టిన యుక్తి తర్వాత ఎన్నో కమర్షియల్ యాడ్స్ లో నటించింది. ఆ టైమ్ లోనే అమ్మడుకి నాగశౌర్య సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఇమ్రాన్ హష్మీతో యుక్తి చేసిన లూట్ గయే మ్యూజిక్ ఆల్బమ్ వల్లే తనకు సినీ అవకాశాలొచ్చాయి.




# తెలంగాణ కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్టే: సీఎం రేవంత్‌రెడ్డి

దిల్లీ: తెలంగాణ కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్టేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "మంత్రివర్గంలో ఎవరు ఉండాలో అధిష్ఠానానిదే తుది నిర్ణయం. నేను ఎవరి పేరు ప్రతిపాదించట్లేదు. ప్రతిపక్ష నేతలపై కేసుల విషయంలో చట్ట ప్రకారమే వెళ్తాం. త్వరగా అరెస్టు చేయించి జైలులో వేయాలనే ఆలోచన మాకు లేదు. సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పనిచేస్తున్నాం. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని కులగణన సర్వే చేశాం. కులగణనతో ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అయింది. పీసీసీ కార్యవర్గ కూర్పు కొలిక్కి వచ్చింది.

దీనిపై ఒకట్రెండు రోజుల్లో ప్రకటన ఉంటుంది. రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ నేను కోరలేదు. రాహుల్‌తో నా అనుబంధంపై తెలియనివాళ్లు మాట్లాడితే నాకేంటి? ప్రభుత్వం, పార్టీలో కీలక నిర్ణయాలు అధిష్ఠానం దృష్టిలో ఉంటాయి. పార్టీ, పార్టీ నేతల మనోభావాలకు అనుగుణంగానే ఉంటా. వ్యక్తిగత నిర్ణయాలు ఎప్పుడూ ఉండవు. పార్టీ ఇచ్చిన పని పూర్తి చేయడమే నా లక్ష్యం. పని చేసుకుంటూ పోవడమే నాకు తెలుసు. ప్రతి ఒక్క విమర్శకు స్పందించాల్సిన అవసరం లేదు. కులగణనలో బీసీలు ఐదున్నర శాతం పెరిగారు. బీసీలు పెరిగిన విషయాన్ని లెక్కలతో సహా చూశాక భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ అసెంబ్లీలో అంగీకరించారు" అని సీఎం వివరించారు.



# ప్రధాని మోదీని కలిసిన అక్కినేని కుటుంబం



దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీని శుక్రవారం పార్లమెంట్‌లో అక్కినేని కుటుంబం కలిసింది. ఇటీవల 'మన్ కీ బాత్'లో లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రధాని మోదీ ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి సినీనటుడు నాగార్జున కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం అక్కినేని నాగేశ్వరరావు జీవిత చరిత్రను ప్రధాని మోదీ ఆవిష్కరించారు. ప్రధాని మోదీని కలిసిన వారిలో అక్కినేని కుటుంబ సభ్యులు, మాజీ ఎంపీ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు ఉన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.




కరీంనగర్: కులగణనపై కులసంఘాల నేతలకు వివరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణనను దేశం మొత్తం చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తున్నారన్నారు. వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటామా అని ప్రశ్నించారు. భారాస నేతలు సర్వేలో పాల్గొనరని.. అవహేళన మాత్రం చేస్తారని ఎద్దేవా చేశారు. సర్వేలో పాల్గొన్న వాళ్లకే కులగణనపై మాట్లాడే అవకాశం ఉందని పేర్కొన్నారు. "బీసీలకు 42 శాతం సీట్లు ఇచ్చేందుకు మా పార్టీ సిద్ధం. భారాస నేతలు వెనుకబడిన వర్గాలకు క్షమాపణలు చెప్పాలి. కులగణనలో ఏ తప్పు లేదు.. ఏదైనా తప్పు కనిపిస్తే నా దృష్టికి తీసుకురావాలి. సబ్‌ప్లాన్, పథకాల రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కులగణన చేయాలని డిమాండ్ ఉంది. ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న దీన్ని మా ప్రభుత్వం పక్కాగా పూర్తి చేసింది. ఇందులో భాగంగా ప్రజలు ఇష్టపూర్వకంగా సమాచారం ఇచ్చారు. కులగణన చేయబోమని కేంద్రంలో భాజపా అఫిడవిట్ ఇచ్చింది. ఆ పార్టీ ఫ్యూడలిస్టిక్ పార్టీ" అని పొన్నం ప్రభాకర్ విమర్శించారు.

# కల్తీ ఆహార ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ: హరీశ్‌రావు



హైదరాబాద్: కల్తీ ఆహార ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. గురుకులాల్లో వందల సంఖ్యలో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగాయని విమర్శించారు. కల్తీ ఆహారం పెడితే అరెస్టు చేస్తామని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారని గుర్తుచేశారు. ఆయన హెచ్చరించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని చెప్పారు. "రేవంత్ రెడ్డి.. మీ మాటలు ఆచరణలో జరగలేదనడానికి గురుకులాల దీనస్థితే నిదర్శనం. ఆహార కల్తీ ఘటనల్లో వందల మంది విద్యార్థులు ఆసుపత్రుల పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి. ఫుడ్ పాయిజన్ కేసులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం" అని హరీశ్‌రావు అన్నారు.

# అరెస్ట్ వారెంట్‌పై స్పందించిన సోనూసూద్.. ఎక్స్ వేదికగా పోస్ట్

ప్రముఖ నటుడు సోనుసూద్‌కు అరెస్ట్ వారెంట్ జారీ అయిన విషయం తెలిసిందే. మోసం కేసులో వాంగ్మూలం ఇవ్వడానికి రాకపోవడంతో పంజాబ్‌లోని లుథియానా కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ వార్త సోషల్ మీడియాలో తెగ షేర్ కావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. తాజాగా దీనిపై పోస్ట్ పెట్టారు. "సోషల్ మీడియా వేదికగా హల్‌చల్ చేస్తున్న వార్తపై సంచలనాత్మకమైన విషయాలను స్పష్టంచేయాలి. విషయం సూటిగా చెప్పాలంటే నాకు ఎటువంటి సంబంధం లేని అంశం విషయంలో కోర్టు నన్ను సాక్షిగా పిలిచింది. మా న్యాయవాదులు కోర్టుకు సమాధానమిచ్చారు. ఫిబ్రవరి 10న దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తాను. నా ప్రమేయం లేని విషయాలను మీ అందరికీ స్పష్టంగా వివరిస్తాను. ఆ కేసుకు, నాకు ఏవిధమైన సంబంధం లేదు. దీనిపై మీడియా అనవసరంగా దృష్టి సారిస్తుంది. సెలబ్రిటీలను టార్గెట్ చేయడం బాధాకరం" అని రాసుకొచ్చారు. ఇక లుథియానాకు చెందిన న్యాయవాది రాజేశ్ ఖన్నా తనకు మోహిత్ శర్మ అనే వ్యక్తి రూ.10 లక్షలు మోసం చేశాడని కోర్టులో కేసు వేశారు. రిజికా కాయిన్ పేరుతో తనతో పెట్టుబడి పెట్టించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో సదరు న్యాయవాది సోనూసూద్‌ను సాక్షిగా పేర్కొన్నారు. దీంతో విచారణ చేపట్టిన కోర్టు సోనూసూద్‌కు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. "సోనుసూద్‌కు పలుమార్లు సమన్లు పంపించినప్పటికీ అతను హాజరుకాలేదు. వెంటనే అతడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టాలి" అని ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కేసు ఈ నెల 10న మరోసారి విచారణకు రానుంది.




పటాన్‌చెరు అర్బన్: సంగారెడ్డి జిల్లా ఐలాపూర్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం పర్యటించారు. స్థానికంగా ఉన్న ఓ ప్లాట్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగనాథ్ అక్కడికి వెళ్లారు. తమ ప్లాట్లు కబ్జా చేస్తున్నారంటూ బాధితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐలాపూర్‌లో పర్యటించిన హైడ్రా కమిషనర్.. బాధితుల సమస్యలు విన్నారు. ఈ క్రమంలో హైకోర్టు న్యాయవాది ముఖీం జోక్యం చేసుకోవడంతో వారిద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. అనంతరం రంగనాథ్ స్పందిస్తూ.. "భయభ్రాంతులకు గురి చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు ఉంది. రెండు వారాల్లో లోతుగా పరిశీలించి ఇరువర్గాలు చెప్పింది వింటాం. కోర్టు పరిధిలో ఉన్న అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటాం. అన్ని అంశాలను పరిశీలించి 2 నెలల్లో సమస్యను పరిష్కరిస్తాం" అని తెలిపారు.

# ద్వితీయ.. తృతీయ శ్రేణి నగరాలకు పరిశ్రమలు విస్తరించాలి: మంత్రి శ్రీధర్‌బాబు




హైదరాబాద్: తెలంగాణలో డ్రోన్ టెక్నాలజీ విస్తరణకు పలు సంస్థలు ముందుకొచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ ఏడాది కొత్తగా 500 ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సెంటిలియాన్, హెచ్‌పీ రోబోటిక్స్ సంస్థల ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన, పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి నమ్మకం కలిగించే విధంగా పారిశ్రామిక విధానాలు రూపొందిస్తున్నామన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకూ పరిశ్రమలు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ పాలనపై లేదు: కేటీఆర్ ఆగ్రహం..

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం సరిగా అందడం లేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ మండిపడ్డారు. నాణ్యమైన భోజనం అందించడం లేదని, పిల్లలను పస్తులు ఉంచుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారంటే, ఇక మంత్రుల నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదని ధ్వజమెత్తారు. ఢిల్లీకి మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ చిన్నపిల్లలకు భోజనం అందించడంలో సీఎంకు లేదంటూ విమర్శించారు. ఇదేనా ప్రజాపాలన అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ ఎద్దేవా చేశారు.



**అసలు విషయం ఇదే..** కాగా, మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం నాచారం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం అందించడం లేదంటూ పలు వార్తపత్రికలు ప్రచురించాయి. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికలకు వివాదం తలెత్తడంతో పిల్లలకు అన్నం పెద్దలేదన్న వార్తలు వెలువడ్డాయి. కొన్ని నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో విద్యార్థులకు కార్మికులు అరకొరగా భోజనం అందిస్తున్నారు. కొన్ని రోజులుగా ఆహారం నాణ్యతా లోపించడంతో వారి పస్తులు ఉంటూ తిరిగి ఇంటికి వెళ్లి భోజనం చేస్తున్నారు. మరోవైపు నిన్న(శుక్రవారం) పాఠశాల ప్రిన్సిపల్, మధ్యాహ్న భోజన కార్మికులకు మధ్య వివాదం నెలకొంది. దీంతో విద్యార్థులకు నిన్న భోజనం అందించలేదు. దీనిపై చిన్నారులు తమ తల్లిదండ్రులకు విషయం చెప్పగా ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న డీఈవో నేరుగా పాఠశాల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. ప్రిన్సిపల్, వంట ఏజెన్సీ కార్మికలపై సీరియస్ అయ్యారు. దీనికి సంబంధించిన వార్తా పత్రికల క్లిపింగులను కేటీఆర్ తన ట్వీట్‌కు జత చేశారు.

**కేటీఆర్ ట్వీట్..** "పేదల గూళ్లపై బుల్డోజర్లు పంపడంలో ఉన్న ప్రేమ.. బడిపిల్లలకు బుక్కెడు బువ్వపెట్టడంలో లేదా?. అమృత్ స్కీమ్‌ను అప్పనంగా బామ్మర్దికి కట్టబెట్టడంలో ఉన్న తెలివి, బుక్కెడు బువ్వకు అలమటిస్తున్న పసిపిల్లల కడుపు నింపడంలో లేదా?. పారిశ్రామికవేత్త అదానీకి తెలంగాణ వనరులు దోచిపెట్టడంలో ఉన్న శ్రద్ధ.. ప్రభుత్వ పాఠశాలల దీనస్థితిపై లేదా?. మూసీ ప్రక్షాళన పేరుతో మూటలు కట్టి ఢిల్లీకి కట్టలు పంపడంలో ఉన్న ప్రేమ.. భవిష్యత్ భారతావని వారసులైన పసిపిల్లల ఆకలి కేకలపై లేదా?. మంత్రుల సంగతి దేవుడెరుగు, ముఖ్యమంత్రి ఇలాకాలోనే పిల్లల పస్తులు ఉంటున్నారు. మీ ఢిల్లీ బాసులు.. మీ గల్లీ దోస్తుల ఆకలి తీర్చడం కాదు రేవంత్.. ముందు మధ్యాహ్న భోజన పథకంపై దృష్టి పెట్టు. ఒక్కపూట ఫొటోలకు ఫోజులిచ్చి గప్పాలు కొట్టడం కాదు. నిత్యం గుప్పెడు అన్నం అందుతుందో లేదో సమీక్ష చేసి చూడు. ఇది ప్రజాపాలన కాదు.. ప్రజలను వేధించే పాలన" అంటూ ట్వీట్ చేశారు.

# ఆగని హైడ్రా దూకుడు.. ఏకంగా ఎయిర్ పోర్టు దగ్గరే..




హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్ పోర్ట్ రోడ్డులో శుక్రవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేతలకు దిగారు. పన్ను కట్టకుండా అక్రమంగా నిర్మించిన ప్రకటనల హోర్డింగ్ పాయింట్స్. అక్రమ హోర్డింగ్‌లను అధికారులు కూల్చివేస్తున్నారు. స్థానిక మున్సిపాలిటీ అధికారుల ఫిర్యాదుతో హైడ్రా చర్యలకు దిగింది. అలాగే శంషాబాద్‌లోని సిద్ధాంతి జాతీయ రహదారి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ ప్రాంతంలోని హోర్డింగ్‌లను తొలగించడానికి హైడ్రా సిబ్బందితో సహా ఇక్కడికి వచ్చి పరిశీలన జరుపుతోంది. మరికొద్ది సేపట్లో కూల్చివేతల ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కాగా కొద్ది రోజులుగా దూకుడు తగ్గించిన హైడ్రా మళ్లీ రంగంలోకి దిగింది. రెండు రోజుల క్రితం శంషాబాద్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. సర్వే నంబర్లు 601, 602 లో చేపట్టిన ప్రహరీ గోడను కూల్చివేశారు. వివాదాస్పద రోడ్డు స్థలం విషయంలో ఫిర్యాదులు రావడంతో కూల్చివేశారు. అయితే తమ పట్టా భూమిలో తాము నిర్మించుకున్న ప్రహరీ గోడను హైడ్రా అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేసారని బాధితులు మండిపడుతున్నారు. కాగా నిర్మాణరంగ, ఇతర వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని హైడ్రా నిర్ణయించింది. చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పోసే వాహనాలపై సంస్థ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాయి. పలు ప్రాంతాల్లో అక్రమంగా వ్యర్థాలు డంప్ చేస్తోన్న నాలుగు టిప్పర్లను హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు పట్టుకున్నాయి. ఉందాసాగర్‌లో వ్యర్థాలు పోస్తోన్న నాలుగు టిప్పర్లు, పోసిన మట్టిని వెంటనే చదును చేస్తోన్న ప్రొక్లెయినర్‌నూ పట్టుకున్నారు. అలాగే కూకట్ పల్లి నిజాంపేట మెయిన్ రోడ్డులో.. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన నిర్మాణాలను జేసీబీలతో హైడ్రా అధికారులు కూల్చివేశారు. నిజాంపేట హోలిస్టిక్ ఆస్పత్రి వెనక భాగంలో ఆర్మీ ఉద్యోగికి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలం చుట్టుపక్కల వాళ్లు పెద్ద పెద్ద నిర్మాణాలు చేపట్టారు. ప్రహరీగోడలు కట్టేశారు. కొన్నేళ్లుగా ఈ విషయంపై ఆర్మీ ఉద్యోగి పోరాటం చేస్తున్నా ఎలాంటి ఫలితం లేదు. ఈ క్రమంలో ఆర్మీ ఉద్యోగి ఆధారాలతో సహా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు.. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని నిర్ధారించి.. గురువారం జేసీబీలతో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఆర్మీ ఉద్యోగికి స్థలాన్ని అప్పగించారు.

# మస్తాన్ సాయి కేసు.. రంగంలోకి యాంటీ నార్కోటిక్స్ పోలీసులు



హైదరాబాద్: యువతుల ప్రైవేటు వీడియోలను సేకరించి బెదిరింపులకు పాల్పడుతున్న వ్యవహారంలో అరెస్టయిన మస్తాన్ సాయి కేసులో యాంటీ నార్కోటిక్స్ పోలీసులు రంగంలోకి దిగారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. మస్తాన్ సాయి డ్రగ్స్ దందాపై ఈ టీమ్ ఆరా తీస్తోంది. ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించింది. టాస్క్‌ఫోర్స్‌తో కలిసి సైబరాబాద్ నార్కోటిక్ బ్యూరో పనిచేస్తోంది. ఇప్పటికే లావణ్య పిర్యాదుతో మస్తాన్ సాయిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని నార్సింగి పోలీసులు ఏడు రోజుల కస్టడీకి కోరారు. కస్టడీ విచారణలో తెలంగాణ న్యాబ్ పోలీసులు పాల్గొననున్నారు. మస్తాన్ సాయి డ్రగ్స్ పార్టీల్లో పాల్గొన్న వారికీ అధికారులు నోటీసులు ఇవ్వనున్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com